

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 12-11-2025 | సంపుటి - 25 | సంచిక -177 | రూ : 4 | పేజీలు: 8


### అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలి..

## ప్రధానిని కోరతా: సీఎం

- అందెశ్రీ కీర్తిని శాశ్వతం చేస్తామన్న రేవంత్
- ఆయన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ
- ఆయన మరణం ఆప్పుడిని కోల్పోయిన బాధను కలిగించిందని వ్యాఖ్య



2లో



2లో

### ఢిల్లీ పేలుడు.. భారత్ కు

## ప్రపంచదేశాల సంఘీభావం

- ఢిల్లీ ఎర్రకోట మెట్రో స్టేషన్ వద్ద కారు పేలుడు
- ఘటనలో 8 మంది దుర్మరణం, పలువురికి గాయాలు
- ఐర్లాండ్, చైనా, జర్మనీ దేశాల నుంచి సంతాప సందేశాలు
- ఉక్రెయిన్, యూకే నేతలు సైతం తీవ్ర దిగ్భ్రాంతి
- పేలుడు ఘటనపై వెల్లువెత్తిన అంతర్జాతీయ స్పందన

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీదే గెలుపు: ఎగ్జిట్ పోల్ సర్వేలు

2లో

### ఛత్తీస్‌గఢ్‌లో...

## భారీ ఎన్‌కౌంటర్

- ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు
- బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఘటన
- భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం
- మావోయిస్టుల ఉనికి తగ్గిపోయిందన్న బస్తర్ రేంజ్ ఐజీ
- తప్పించుకున్న మావోల కోసం అడవులను జల్లెడ పడుతున్న బలగాలు



2లో



2లో

## బీహార్‌లో మళ్లీ ఎన్డీయే ప్రభంజనం..

### ముక్తకంఠంతో చెబుతున్న ఎగ్జిట్ పోల్స్!

- బీహార్ లో నేడు ముగిసిన రెండో విడత పోలింగ్
- ఎగ్జిట్ పోల్స్ వెల్లడి.. ఎన్డీయేకు భారీ మెజారిటీ అంచనా
- మహాగట్బంధన్‌కు నిరాశ తప్పదంటున్న సర్వేలు
- పనిచేయని ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' ఫ్యాక్టర్
- ఎన్డీయే వైపు భారీగా మొగ్గు చూపిన మహిళా ఓటర్లు
- దాదాపు అన్ని సర్వేల్లోనూ బీజేపీ కూటమికే పట్టం

### అమరావతి విచ్చేసిన

## కేంద్రమంత్రి శివరాజ్ సింగ్

ఏపీ సమస్యలు వివరించిన సీఎం చంద్రబాబు



2లో

### ముగిసిన జూబ్లీహిల్స్

# ఉప ఎన్నిక పోలింగ్..

**క్యూలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అవకాశం**

- మాగంటి గోపీనాథ్ అకాల మృతితో ఉప ఎన్నిక
- ఈ నెల 14న ఓట్ల లెక్కింపు
- జూబ్లీహిల్స్ బరిలో 58 మంది అభ్యర్థులు



2లో





2లో

### అందెశ్రీ పాడెను మోసిన

## సీఎం రేవంత్ రెడ్డి

- ఘట్‌కేసర్‌లో ముగిసిన అందెశ్రీ అంత్యక్రియలు
- అంతిమ సంస్కారాలకు రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు
- అందెశ్రీ లేకపోవడం తీరని లోటు అన్న ముఖ్యమంత్రి

# బీహార్‌లో మళ్లీ ఎన్డీయే ప్రభంజనం... ముక్తకంఠంతో చెబుతున్న ఎగ్జిట్ పోల్స్!

బీహార్, నవంబర్ 11 : బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే మరోసారి ఘన విజయం సాధించబోతోందని ఎగ్జిట్ పోల్స్ ముక్తకంఠంతో చెబుతున్నాయి. మంగళవారం రెండో విడత పోలింగ్ ముగిసిన వెంటనే వెలువడిన దాదాపు అన్ని సర్వేలు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకే అధికారాన్ని కట్టబెట్టాయి. ఆర్జేడీ కాంగ్రెస్ కూటమి అయిన మహాగట్బంధన్ కూటమికి తీవ్ర నిరాశ తప్పదని అంచనా వేశాయి. వివిధ జాతీయ సర్వే సంస్థలు విడుదల చేసిన ఎగ్జిట్ పోల్స్ ప్రకారం, ఎన్డీయేకు 130 నుంచి 167 సీట్ల వరకు దక్కే అవకాశం ఉంది. మరోవైపు, మహాగట్బంధన్ కూటమి 70 నుంచి 108 స్థానాల మధ్య పరిమితం కావొచ్చని తెలుస్తోంది. బీహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 122 సీట్ల మేజిక్ ఫిగర్ అవసరం కాగా, ఎన్డీయే సునాయాసంగా ఆ మార్కును దాటుతుందని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రభావం చూపుతారని భావించిన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' పార్టీ ఏమాత్రం సత్తా చాటలేకపోయిందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. చాలా సర్వేలు ఆయన పార్టీకి 0 నుంచి 5 సీట్ల లోపే వస్తాయని పేర్కొన్నాయి. దీంతో, బీహార్ రాజకీయాలపై 'పీకే ఫ్యాక్టర్' పనిచేయలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. మ్యాట్రిజ్ ఎగ్జిట్ పోల్ ప్రకారం, మిథిలాంచల్, భాగల్‌పూర్ వంటి ప్రాంతాల్లో ఎన్డీయే ప్రభంజనం సృష్టించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, 65 శాతం మంది మహిళా ఓటర్లు ఎన్డీయేకు మద్దతుగా నిలిచినట్లు ఈ సర్వే వెల్లడించింది. అలాగే, 51 శాతం ఓబీసీలు, 49 శాతం ఎస్సీ ఓటర్లు కూడా ఎన్డీయే వైపే మొగ్గు చూపినట్లు పేర్కొంది. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలున్న బీహార్‌లో రెండు విడతల్లో పోలింగ్ జరిగింది. వెలువడిన ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఈ విధంగా ఉన్నప్పటికీ, పూర్తి ఫలితాలు తెలియాలంటే ఓట్ల లెక్కింపు వరకు వేచి చూడాల్సిందే. బీహార్ లో మొత్తం 243 స్థానాలకు గాను... నవంబరు 6న జరిగిన తొలి విడతలో 121 స్థానాలకు పోలింగ్ జరిగింది. నేడు (నవంబరు 11) రెండో విడతలో మిగిలిన 122 స్థానాలకు పోలింగ్ చేపట్టారు. పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగియగానే, ఎగ్జిట్ పోల్స్ వెల్లడయ్యాయి. రెండు విడతల పోలింగ్ పూర్తయ్యాక ఎగ్జిట్ పోల్స్ ప్రకారం ఏ పార్టీ పరిస్థితి ఎలా ఉందో చూస్తే...

**పీపుల్స్ ఇన్ సైట్**
ఎన్డీయే 133-148
మహాకూటమి 87-102
జన్ సురాజ్ 0-2
ఇతరులు 3-6

**జేవీసీ పోల్స్**
ఎన్డీయే 135-150
మహాకూటమి 88-103
జన్ సురాజ్ 0
ఇతరులు 3-6

**మ్యాట్రిజ్**
ఎన్డీయే 147-167
మహా కూటమి 70-90
జన్ సురాజ్ 0-2
ఇతరులు 2-8

**దైనిక్ భాస్కర్**
ఎన్డీయే 145-160
మహాకూటమి 73-91
జన్ సురాజ్ 0
ఇతరులు 510

**పీపుల్స్ పల్స్**
ఎన్డీయే 133-159
మహా కూటమి 75-101
జన్ సురాజ్ 0-5

**పి-మార్క్**
ఎన్డీయే 142-162
మహాకూటమి 80-98
జన్ సురాజ్ 1-4
ఇతరులు 0-3

**చాణక్య స్ట్రాటజీస్**
ఎన్డీయే 130-138
మహాకూటమి 100-108
జన్ సురాజ్ 0
ఇతరులు 3-5

**డీవీ రీసెర్చ్**
ఎన్డీయే 137-152
మహా కూటమి 83-98
జన్ సురాజ్ 2-4, ఇతరులు 1-8

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీదే గెలుపు: ఎగ్జిట్ పోల్ సర్వేలు

హైదరాబాద్, నవంబర్ 11 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఎగ్జిట్ పోల్ సర్వే ఫలితాలు సూచిస్తున్నాయి. దాదాపు అన్ని సర్వేలు కాంగ్రెస్ పార్టీ వైపే మొగ్గు చూపుతున్నాయి. మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈరోజు పోలింగ్ ముగియగా, 14వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. సాయంత్రం 6 గంటలలోపు క్యూలైన్‌లో నిలబడిన వారికి ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. వివిధ ఎగ్జిట్ పోల్ సర్వేల ప్రకారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు 46 శాతానికి పైగా ఓట్లు వచ్చే అవకాశం ఉంది. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 41 శాతం నుంచి 42 శాతం ఓట్లు, బీజేపీకి 6 నుంచి 8 శాతం ఓట్లు వచ్చే అవకాశం ఉందని ఎగ్జిట్ పోల్ సర్వే ఫలితాలు వెల్లడిస్తున్నాయి.

వివిధ ఎగ్జిట్ పోల్ సర్వే ఫలితాలు ఈ విధంగా ఇలా ఉన్నాయి.

చాణక్య స్ట్రాటజీస్ - కాంగ్రెస్ 46 శాతం, బీఆర్ఎస్ 41 శాతం, బీజేపీ 6 శాతం.

పీపుల్స్ పల్స్ -కాంగ్రెస్ 48 శాతం, బీఆర్ఎస్ 41 శాతం, బీజేపీ 6 శాతం.

స్మార్ట్ పోల్ -కాంగ్రెస్ 48.2 శాతం, బీఆర్ఎస్ 42.1 శాతం, బీజేపీ 8 శాతం.

# అమరావతి విచ్చేసిన కేంద్రమంత్రి శివరాజ్ సింగ్

అమరావతి, నవంబర్ 11 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ భేటీ అయ్యారు. చంద్రబాబు ఆహ్వానం మేరకు శివరాజ్ సింగ్ చౌహాన్ మంగళవారం నాడు అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రితో సీఎం చంద్రబాబు దాదాపు గంటపాటు సమావేశమయ్యారు. రాష్ట్రంలోని వ్యవసాయ రంగ సమస్యలు, రైతుల సంక్షేమానికి అవసరమైన కేంద్ర ప్రభుత్వ సహకారంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఇటీవల రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన 'మొంథా' తుపాను వల్ల జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తుపాను కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, ఆదుకోవాలని కోరారు. ముఖ్యంగా మైనర్ ఇరిగేషన్ కింద సాగు చేసే రైతుల సంక్షేమానికి కేంద్రం నుంచి ప్రత్యేక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలు కీలక ప్రతిపాదనలను సీఎం కేంద్ర మంత్రి ముందుంచారు. పీఎంఆర్కేవీవై పీడీఎంసీ (ప్రధానమంత్రి కృషి వికాస్ యోజన పర్ డ్రాప్ మోర్ క్రాప్) పథకం కింద రాష్ట్రానికి అదనపు నిధులు కేటాయించాలని కోరారు. 2024 25, 202526 ఆర్థిక సంవత్సరాలకు కలిపి రూ. 695 కోట్లు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. అదేవిధంగా, మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద తోతాపూరి మామిడి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను చంద్రబాబు వివరించారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటా రూ. 100 కోట్లను వెంటనే విడుదల చేయాలని శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరారు. రాష్ట్ర రైతాంగ సమస్యలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈ సమావేశంలో కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కూడా పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్...
## ఆరుగురు మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్, నవంబర్ 11 : ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో మంగళవారం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఆపరేషన్ మావోయిస్టుల కార్యకలాపాలను అణచివేయడంలో కీలక ముందడుగు అని పోలీసు అధికారులు వెల్లడించారు. పక్కా నిఘా సమాచారంతో ఈ ఆపరేషన్ ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. బీజాపూర్, దంతెవాడ జిల్లాల డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) బృందాలు సంయుక్తంగా అడవుల్లోకి వెళ్లాయి. ఉదయం 10 గంటల సమయంలో భద్రతా బలగాలను గమనించిన మావోయిస్టులు కాల్పులు ప్రారంభించగా, బలగాలు దీటుగా ఎదురుకాల్పులు జరిపాయి. సాయంత్రం వరకు కాల్పులు అడపాదడపా కొనసాగాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ ధృవీకరించారు. ఘటనా స్థలం నుంచి ఇన్సాస్ రైఫిల్స్, స్టెన్ గన్స్, .303 రైఫిల్స్‌తో పాటు భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. మావోయిస్టుల యూనిఫాంలు, కమ్యూనికేషన్ పరికరాలు, విప్లవ సాహిత్యం పుస్తకాలు కూడా లభించాయని తెలిపారు. ఈ ఆపరేషన్‌పై బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ స్పందించారు. "ప్రస్తుతం మావోయిస్టు సంస్థ నాయకత్వం, దిశానిర్దేశం లేకుండా నైతికంగా దెబ్బతింది. కేవలం అబూజ్‌మఢ్ అడవుల్లోని కొన్ని ప్రాంతాలకే వారి ఉనికి పరిమితమైంది. నిఘా ఆధారిత ఆపరేషన్ల విజయానికి ఇది నిదర్శనం" అని ఆయన వ్యాఖ్యానించారు. తప్పించుకున్న మావోయిస్టులు పొరుగు జిల్లాల్లోకి ప్రవేశించకుండా అదనపు బలగాలను మోహరించి, అడవులను జల్లెడ పడుతున్నామని ఆయన తెలిపారు.

# ఢిల్లీ పేలుడు... భారత్ కు ప్రపంచదేశాల సంఘీభావం

ఢిల్లీ, నవంబర్ 11 : దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం సాయంత్రం జరిగిన ఘోర కారు పేలుడు ఘటన యావత్ దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. చారిత్రక ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన ఈ దుర్ఘటనలో 8 మంది ప్రాణాలు కోల్పోగా, అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాదకర ఘటనపై ప్రపంచ దేశాల నుంచి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది. పలు దేశాల అధినేతలు, రాయబారులు భారత్‌కు తమ సంఘీభావాన్ని తెలియజేస్తూ, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, ఎర్రకోట మెట్రో స్టేషన్ గేట్ నంబర్ 1 వద్ద పార్క్ చేసి ఉన్న హర్యానా రిజిస్ట్రేషన్ గల కారులో సోమవారం సాయంత్రం భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి సమీప ప్రాంతమంతా దద్దరిల్లింది. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. ఈ ఘటనతో ఢిల్లీలో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. ఈ భయానక ఘటనపై అంతర్జాతీయ సమాజం తీవ్రంగా స్పందించింది. ఐర్లాండ్ ఉప ప్రధాని సైమన్ హారిస్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, "ఈ ఢిల్లీలో జరిగిన విషాదకరమైన పేలుడు గురించి విని చాలా బాధపడ్డాను. ప్రాణాలు కోల్పోయిన వారికి, గాయపడిన వారికి, వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి. ఈ కష్ట సమయంలో భారత ప్రజలకు, ప్రభుత్వానికి మా పూర్తి మద్దతు, సంఘీభావం తెలియజేస్తున్నాం" అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. భారత్‌లో చైనా రాయబారి జు ఫీహాంగ్ కూడా ఈ విషాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. "ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన పేలుడు నన్ను కలచివేసింది. బాధితులకు నా ప్రగాఢ సానుభూతి. ప్రభావితమైన ప్రతి ఒక్కరి గురించి నేను ఆలోచిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. భారత్‌లో జర్మనీ రాయబారి ఫిలిప్ అకర్‌మాన్ కూడా పేలుడు వార్త విని దిగ్భ్రాంతికి, తీవ్ర ఆవేదనకు గురయ్యానని తెలిపారు. "ఎర్రకోట సమీపంలో నిన్న జరిగిన పేలుడు వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దుర్ఘటనలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు నా హృదయపూర్వక సానుభూతి. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను" అని తెలిపారు. ఈ కష్టకాలంలో భారత ప్రజలకు, ప్రభుత్వానికి అండగా ఉంటామని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. "న్యూఢిల్లీ నడిబొడ్డున జరిగిన విషాదకర పేలుడులో అనేక మంది ప్రాణాలు కోల్పోవడం, గాయపడటం పట్ల భారత ప్రజలు, ప్రభుత్వం పడుతున్న దుఃఖాన్ని ఉక్రెయిన్ పంచుకుంటుంది. బాధితుల కుటుంబాలకు మా సంతాపం. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం" అని పేర్కొంది. యూకే కన్జర్వేటివ్ పార్టీ ఎంపీ ప్రీతి పటేల్ కూడా ఢిల్లీ నుంచి వస్తున్న వార్తలు భయంకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదే సమయంలో, ఢిల్లీలో ఉన్న బ్రిటిష్ పౌరులకు అవసరమైన మద్దతు అందించాలని, సహాయం కోసం వచ్చే అభ్యర్థనలపై స్పందించాలని ఆమె యూకే ప్రభుత్వాన్ని కోరారు. ఈ కష్ట సమయంలో భారత్‌కు అండగా నిలుస్తామని పలు దేశాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు, ఈ పేలుడు ఘటనపై భారత దర్యాప్తు సంస్థలు విచారణ ముమ్మరం చేశాయి.

## ముగిసిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్..

హైదరాబాద్, నవంబర్ 11 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద గేట్లు మూసివేశారు. సాయంత్రం ఆరు గంటల వరకు క్యూ లైన్‌లో ఉన్న ఓటర్లకు ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. 2023లో బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఓట్ల లెక్కింపు ఈ నెల 14న జరగనుంది. జూబ్లీహిల్స్ బరిలో మొత్తం 58 మంది అభ్యర్థులు నిలిచారు. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు నెలకొంది. బీఆర్ఎస్ నుంచి మాగంటి గోపీనాథ్ భార్య మాగంటి సునీత, కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి పోటీ చేశారు. గెలుపుపై ఆయా పార్టీల అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలి... ప్రధానిని కోరతా: సీఎం రేవంత్

హైదరాబాద్, నవంబర్ 11 : ప్రముఖ రచయిత, జన వాగ్గేయకారుడు అందెశ్రీ మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించిన సీఎం, అందెశ్రీ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని, ఆయన కీర్తిని శాశ్వతం చేస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, అందెశ్రీకి మరణానంతరం పద్మశ్రీ పురస్కారం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. "అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని కోరుతూ ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశాను. త్వరలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి ఈ విషయంపై వ్యక్తిగతంగా విజ్ఞప్తి చేస్తాను. ఇందుకు కేంద్ర మంత్రులు కూడా సహకరించాలి" అని ఆయన కోరారు. తెలంగాణ ఉన్నంత వరకు అందెశ్రీ పేరు నిలిచి ఉండేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని సీఎం గుర్తుచేసుకున్నారు. "రాజకీయ నేతలను నేరుగా కలవనని చెప్పిన అందెశ్రీ గారితో మీడియా ద్వారానే పరిచయం ఏర్పడింది. ఆయన మరణం నాకు వ్యక్తిగతంగా ఒక ఆప్తుడిని కోల్పోయిన బాధను మిగిల్చింది" అని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "జీవితాంతం తెలంగాణ కోసం తపించిన గొప్ప వ్యక్తి ఆయన. రచయితగా, కళాకారుడిగా ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు పడ్డారో అందరికీ తెలుసు. తన ఆరోగ్యం గురించి కానీ, డబ్బు గురించి కానీ ఏనాడూ ఆలోచించని నిస్వార్థ జీవి" అని కొనియాడారు. అందెశ్రీ రచించిన 'నిప్పుల వాగు' పుస్తకం 20 వేల ప్రతులను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉంచుతామని సీఎం వెల్లడించారు. ఆయన అభిమానుల నుంచి కూడా సలహాలు, సూచనలు స్వీకరించి, ఆయనకు సముచిత న్యాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## కారు బాంబు పేలుడు.. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా



ఢిల్లీ, నవంబర్ 11 : ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనలో బాధిత కుటుంబాలకు ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ పేలుడులో 13 మంది మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబాలకు ఢిల్లీ ప్రభుత్వం రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి మాట్లాడుతూ, శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి రూ. 5 లక్షలు, క్షతగాత్రులకు రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు తెలిపారు. బాధితులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. ఈ పేలుడు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి రేఖా గుప్తా సంతాపం తెలియజేశారు.

# అందెశ్రీ పాడెను మోసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 11 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ పాడెను మోశారు. అందెశ్రీ అంత్యక్రియలు హైదరాబాద్ నగర శివారులోని ఘట్‌కేసర్‌లో నిర్వహించారు. ఈ అంతిమ సంస్కారాలకు రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అంతిమ యాత్రలో అందెశ్రీ పాడెను రేవంత్ రెడ్డి మోశారు. తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అందెశ్రీ అంత్యక్రియల అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు.

*** వ్యక్తిగతంగా, తెలంగాణ సమాజానికి లోటు: రేవంత్ రెడ్డి**

అందెశ్రీ మరణం వ్యక్తిగతంగా తనకు, తెలంగాణ సమాజానికి తీరని లోటు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో రాష్ట్రం గురించి అనేక విషయాలు ఆయనతో చర్చించినట్లు తెలిపారు. అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ'ను రాష్ట్రగీతంగా నిర్ణయించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అందెశ్రీ ప్రతి మాట ప్రజా జీవితం నుంచి పుట్టుకు వచ్చిందని అన్నారు. ప్రతి పాట తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపిందని అన్నారు. 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని పాఠ్యపుస్తకాల్లో చేరుస్తామని అన్నారు. అందెశ్రీ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని అన్నారు. తన జీవితాన్ని ప్రజల కోసం త్యాగం చేసిన మహనీయుడు ఆయన అని అన్నారు. ఆయన రచనలకు సంబంధించిన 'నిప్పులవాగు' పుస్తకాన్ని ప్రతి గ్రంథాలయంలో అందుబాటులో ఉంచుతామని అన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే తన ధ్యేయం

*** జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే తన ధ్యేయమని జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజు అన్నారు. ఎస్పీ పిలుపు మేరకు ఈనెల 15వ తేదీ వరకు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైతన్యం -డ్రగ్స్ పై యుద్ధం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సుజాతనగర్ పోలీసుల ఆధ్వర్యంలో సుజాతనగర్ సెంటర్ నుండి కొత్తగూడెం మీదుగా లక్ష్మీదేవిపల్లిలోని ఇల్లందు క్రాస్ రోడ్ వరకు భారీ బైకు ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. తొలుత ఎస్పీ మాట్లాడుతూ చైతన్యం అనే కార్యక్రమం ద్వారా నిషేదిత గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన యువత పడకుండా అవగాహన కల్పించడం, గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడం కోసం నిరంతర తనిఖీలు చేపట్టడం వంటి కార్యక్రమాలను జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, కొత్తగూడెం టూ టౌన్ సీఐ ప్రతాప్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, వన్ టౌన్ సీఐ కరుణాకర్, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి, సుజాతనగర్ ఎస్సై రమాదేవి, పోలీస్ సిబ్బంది, సుమారు వెయ్యి మంది వాహనదారులు పాల్గొన్నారు.

# ఘనంగా పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు




ప్రజాస్ఫూర్తి, కాప్రా: డా. ఏ.ఎస్. రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఆమె నివాసంలో ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే స్నేహితులు, అనుచరులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేయడానికి తరలివచ్చారు. పుష్పగుచ్ఛాలు అందజేసి పావని మణిపాల్ రెడ్డిని అభినందించారు. ఫోన్ ద్వారా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ రావు, కార్పొరేటర్ లు, మాజీ కార్పొరేటర్ లు, డివిజన్ అధ్యక్షులు వివిధ పార్టీ నాయకులు డివిజన్ కాలనీ జర్నలిస్ట్ లు వాసులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుండే పావని మణిపాల్ రెడ్డి సేవా కార్యక్రమాలను పలువురు ప్రశంసించారు. పుట్టినరోజు సందర్భంగా ఆమె అందరి ప్రేమ, ఆశీస్సులకు కృతజ్ఞతలు తెలిపారు.



# నిరుపేద కుటుంబానికి కార్పొరేటర్ ఆర్థిక సహాయం అందజేత

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీకి చెందిన రాధా గుండె కు సంబందించిన వైద్య పరీక్షలు చేయించుకోవడానికి డబ్బులు లేక అవస్థలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆమెకు వైద్య పరీక్షలు నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు.

# క్రషర్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం

*** బ్లాస్టింగ్లతో ఇంటి గోడలు పర్రెలు రావడం, దుమ్ముతో శ్వాసకోశ సమస్యలు**

*** తగరం సుభాష్ చంద్రబోస్**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: జాతీయ రహదారికి సమీపంలో ఉన్న క్రషర్లతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు తగరం సుభాష్ చంద్రబోస్ అన్నారు. చౌటుప్పల్ మండలం ఖైతాపురం, బొర్రలగూడెం,దండుమల్కాపురం గ్రామాల పరిధిలోని బీఆర్ఆర్, అనంతసాయి, రఫీ స్టోన్ క్రషర్ల వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. క్రషర్ల పరిధిలో ఎంత లోతుకు తవ్వారో పరిశీలించారు. ఈ సందర్భంగా తగరం సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ బీఆర్ఆర్, అనంతసాయి, రఫీ స్టోన్ క్రషర్ల వల్ల పరిసర గ్రామాల ప్రజలకు చాలా రకాలుగా ఇబ్బందులు కలుగుతున్నాయని ఆరోపించారు. క్రషర్లలో ఇష్టానుసారంగా బ్లాస్టింగ్లు చేయడం వల్ల గ్రామాలలో ఇండ్లు అదురుతున్నాయని ఆరోపించారు. క్రషర్ల ద్వారా వచ్చే దుమ్ముతో ప్రజలు అనారోగ్యంలో బారిన పడుతున్నారని, ప్రజలకు శ్వాస కోశ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రషర్ల నుంచి వాహనాలు బయలుదేరి క్రమంలో అతివేగంతో వచ్చి ప్రమాదాలు సైతం జరిగిన సంఘటనలు ఉన్నాయన్నార. అదేవిధంగా వాహనాల నుంచి డస్ట్, కంకర జాతీయ రహదారిపై పడిన పట్టించుకునే నాధుడే కరువయ్యాడన్నారు. జాతీయ రహదారిపై పడిన కంకర, డస్ట్ వల్ల ప్రమాదాలు జరిగి వాహనదారులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయని ఆరోపించారు. ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న, ప్రమాదాలకు కారణం అవుతున్న క్రషర్లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. క్రషర్ల లైసెన్సులను రద్దుచేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ప్రభుత్వానికి విన్నవించారు. లేనిచో బహుజన్ సమాజ్ పార్టీ తరపున పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మునుగోడు నియోజకవర్గ ఇంచార్జి కత్తుల పరమేశ్, ఉపాధ్యక్షుడు సుక్క రాములు, చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షుడు గడ్డమీది బాబు, లింగస్వామి, ఖైతాపురం నాయకులు తగరం నర్సింహా, సాయితేజ చారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యాభివృద్ధికి పునాది వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్

**– కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భారత రత్న, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ జీవితంలో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు.మంగళవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 137వ జయంతి, జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీల సంక్షేమ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్య అతిథిగా, అదనపు కలెక్టర్లు డి. వేణుగోపాల్, విద్యా చందన లతో కలిసి హాజరై మౌలానా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి పునాది వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలు అపారమైనవన్నారు.ఆయన దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా భారత విద్యా విధానానికి బలమైన పునాది వేశారన్నారు. పేద, వెనుకబడిన వర్గాల పిల్లల విద్యకు మార్గం చూపారని పేర్కొన్నారు.మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధికారి సంజీవరావు, బీసీ వెల్ఫేర్ అధికారి విజయలక్ష్మి, ఐడిఓసి అధికారులు, సిబ్బంది , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# భక్తి స్ఫూర్తితో ‘జై శ్రీరామ్’ ఇటుకలు

*** భద్రాచలంలో కలెక్టర్ జితేష్ ప్రత్యేక చర్యలు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ‘జై శ్రీరామ్’ అచ్చుతో ఇటుకల తయారీకి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రత్యేక ముందడుగు వేశారు. ఈ కార్యక్రమం కోసం అవసరమైన ప్రత్యేక మోల్డ్‌లను కలెక్టర్ స్వయంగా బెంగళూరులో తయారు చేయించి దేవస్థానానికి పంపించారు.మంగళవారం భద్రాచలం పర్యటనలో భాగంగా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సీఎస్ఈబి మిషన్‌ను ప్రత్యక్షంగా పరిశీలించారు. భక్తి స్ఫూర్తితో ‘జై శ్రీరామ్’ అచ్చు ఉన్న ఇటుకలను తయారు చేసే విధానంపై ఆలయ ఈవో, సిబ్బందికి సూచనలు అందజేశారు.భక్తులు స్వయంగా పాల్గొని ఇటుకల తయారీలో భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని రూపుదిద్దించారు.



# ముఖ్యమంత్రి సహాయనిధి.. పేదలకు వరం

**- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఓ వరంలాంటిదని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రం సిపిఐ మండల పార్టీ కార్యాలయంలో చౌటుప్పల్, నారాయణపురం మండలాల కు చెందిన పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ సీఎం సహాయనిధి పథకం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేదవారికి కొంత లబ్ధి చేకూరుతుందన్నారు. పేద ప్రజలు ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో ప్రవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటే ఆరు నెలల లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో ఉన్న పేదవాళ్లకు అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, సిపిఐ నాయకులు ఉడత రామలింగం, కొండూరు వెంకటేష్, రొండి నరసింహ, టంగుటూరి రాములు, రోషణగారి అంజయ్య, బత్తుల సుధాకర్, నీల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప మాలదారులకు అన్నదానం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో అయ్యప్ప స్వామి నిత్య అన్నదానంలో భాగంగా కొయ్యడ నరసింహ గౌడ్ లక్ష్మమ్మ దంపతుల కుమారులుకోడళ్ళు వెంకన్నపారిజాత, గాలయ్యఅనిత, శేఖర్‌ప్రవళిక దంపతులు అయ్యప్ప మాలదారులకు మంగళవారం అన్నదానం నిర్వహించారు. అయ్యప్ప స్వామి మలాదారులకు అన్నదానం చేయడం వారి పూర్వ జన్మ సుకృతంగా, అదృష్టంగా భావించారు. వారి కుటుంబానికి అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఏళ్లవేళలా ఉండాలని, ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు అయ్యప్ప స్వామి ప్రసాదించాలని మనసారా అయ్యప్ప స్వామి మాలదారులు, శివదీక్ష, హనుమాన్ దీక్ష మాలదారులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అన్నదానం నిర్వాహకులు తొర్పునూరి నర్సింహ గౌడ్, సన్నిధానం గురుస్వామి చెరుకు అశోక్ గౌడ్, కళ్ళెం నాగరాజు గౌడ్, చెవగాని మహేష్ గౌడ్, స్వాములు మార్గం శేఖర్ యాదవ్, అందోజు సన్నిధ్ చారి, పోల్దాస్ రాజు, దాసరి మురళిస్వామి, బందారపు శివగౌడ్, చెరుకు చైతన్య, తొర్పునూరి సాయిలు గౌడ్, ఆలయం కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ క్రీడా ప్రాంగణం,పార్క్ వార్డు సమస్యలపై కమిషనర్‌కు వినతి



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 6వ వార్డ్ రామవరం క్లబ్ ఏరియాలో గల తెలంగాణ క్రీడా ప్రాంగణం, 6వ వార్డులో పేరుకుపోతున్న సమస్యలపై కాంగ్రెస్ పార్టీ వార్డు నాయకులు, మైనారిటీ సెల్ పట్టణాధ్యక్షులు ఎం.డి. ఖాజాబక్ష్ ఆధ్వర్యంలో మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ సుజాతకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందని, పట్టించుకునేవారు కరువయ్యారని తెలిపారు. పారిశుధ్య కార్మికులు ప్రతిరోజు ఇళ్లల్లో చెత్తను సేకరించేందుకు రావడంలేదని అన్నారు. అదేవిధంగా పాత శ్రీ రామచంద్ర ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న పార్కుకు నిధులు మంజూరైనా పనులు మాత్రం పూర్తి చేయడంలేదని, పార్కులో పిచ్చి చెట్లు పేరుకుపోయి ప్రమాదకరంగా మారిందన్నారు. పాములు సంచరించడం వల్ల పార్కు, ఓపెన్ జిమ్‌కు వచ్చే చిన్న పిల్లలు ఇబ్బందులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులు కూడా ప్రతినిత్యం ఇదే పార్కుగుండా రాకపోకలు సాగిస్తున్నందువల్ల పాము కాటుకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ సుజాత మున్సిపల్ అధికారులకి రెండు రోజులలో పార్కును శుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎండి కరీం పాషా పాల్గొన్నారు.

## అందే శ్రీ మరణం.. తెలంగాణకు తీరని లోటు

* రాచకొండ భార్గవ్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రజా కవి అందే శ్రీ మరణం.. తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాచకొండ భార్గవ్ అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రం జాతీయ రహదారిపై ప్రజా కవి తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత అందే శ్రీ చిత్రపటానికి మంగళవారం పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాచకొండ భార్గవ్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన ఉదయం అకస్మాత్తుగా ప్రజాకవి అందెశ్రీ మృతి చెందడం బాధాకరమన్నారు. ప్రజా కవి అందే శ్రీ కవిత్వాలు తెలంగాణ నలుమూల సుపరిచితమని కొనియాడారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన కవిత్వాల ద్వారా సజీవంగానే ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ బాల్ మంచ కో ఆర్డినేటర్ పెద్దగొని రమేష్ గౌడ్, యువజన యువజన కాంగ్రెస్ మునుగోడు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి చింతల రాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఊదరి శ్రీనివాస్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు చౌట లింగస్వామి, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు వర్కాల రాము, ఆవుల రాజు, పబ్బతి వెంకటేష్, చింతల శివ ప్రసాద్, మలిగె మల్లేష్, తొర్పునూరి రవి గౌడ్, లింగస్వామి, బోయ సంపత్ , రాజు, ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షుడు బోయ నవీన్, డాకోజు అజయ్, ఎర్ర శ్రవణ్, దిలీప్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించాలి : బూరుగు కృష్ణారెడ్డి




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలంలోని ప్రజా సమస్యలు పరిష్కరించాలని.. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని.. త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. చౌటుప్పల్ సిపిఎం పార్టీ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ చౌటుప్పల్ మండలంలోని గ్రామాలలో వర్షాలకు రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయన్నారు. వాటి మరమ్మతులు త్వరగా డిమాండ్ చేశారు. కొద్దిరోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు మార్కెట్లో ఉన్న ధాన్యం తడిసి రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితుల నోటీసుల పేరు మీద ప్రభుత్వ అధికారులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. భూ నిర్వాసితులకు మార్కెట్ ధరలు ఇచ్చి రైతులను కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, గంగదేవి సైదులు, రాగీరు కిష్టయ్య, గోశిక కరుణాకర్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి, తడక మోహన్, బోయ యాదయ్య, చింతల సుదర్శన్, పల్లె మధు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మాయికి... అందాల అరవంకీ!

**అరవంకీ... ఆ పేరే ఎంతో అందంగా వినిపిస్తుంది. ఇక, దాన్ని ముద్దులొలికే చిన్నారి భుజాలకి తొడిగినా, పడచుపిల్లకి అలంకరించినా... ఆ అందం చూడతరమా!**























# నవీన్ యాదవ్‌కు భారీ మెజార్టీ ఖాయం: పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో... పోలింగ్ జరిగిన తీరు, క్షేత్ర స్థాయిలో తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు చెబుతున్న సమాచారం మేరకు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు భారీ మెజారిటీ వస్తుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సరళిపై ఆయన స్పందించారు. చాలా ప్రశాంతంగా ఉప ఎన్నిక జరిగిందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున తమ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇచ్చినట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, అభ్యర్థికి మద్దతు ఇచ్చినట్లుగా అక్కడ ఉన్న తమ నాయకుల ద్వారా తెలుస్తోందని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ మహేశ్ కుమార్



గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... రెగ్యులర్‌గా పర్యవేక్షిస్తూ అందరికీ సలహాలు, సూచనలు ఇస్తూ ముందుకు నడిపించారని కొనియాడారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, మహిళ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ విభాగాలతోపాటు సీనియర్ నాయకులు అందరూ ప్రభుత్వ పథకాలను జనంలోకి తీసుకెళ్లడంలో విజయవంతం అయ్యారన్నారు. తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉండటంతో.. తమ అభ్యర్థికి పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. భారీ మెజారిటీతో తమ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.




## జూబ్లీహిల్స్ పోలింగ్.. పలువురు ఎమ్మెల్యేలపై కేసు నమోదు

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియామవళిని ఉల్లంఘించిన పలువురిపై హైదరాబాద్ పోలీసులు 3 కేసులు నమోదు చేశారు. ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రామచంద్రనాయక్, రాందాస్‌పై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, మెతుకు ఆనంద్‌పై బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదైనట్టు పోలీసులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠినంగా వ్యవహరిస్తున్నట్లు హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా జరగాలంటే ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియామవళిని గౌరవించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినట్లు గమనిస్తే వెంటనే డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## జూబ్లీహిల్స్ పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్ జరుగుతోంది

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్ కొనసాగుతున్న వేళ.. భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి సునీత కీలక ఆరోపణలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్ జరుగుతోందని, ఓటర్లను భయపెడుతున్నారని ఆరోపించారు. పలుచోట్ల రౌడీషీటర్లు తిరుగుతున్నారని, ఓటర్లను ప్రలోభాలకు గురిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు



జూబ్లీహిల్స్‌లో ఏం పని?అని ప్రశ్నించారు. మరోవైపు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్‌ను హైదరాబాద్ సీపీ సజ్జనార్ పరిశీలించారు. డ్రోన్ల ద్వారా పోలింగ్ స్టేషన్ల వద్ద పరిస్థితిని వీక్షించారు. పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోందని, దేశంలోనే తొలిసారి డ్రోన్ టెక్నాలజీ ద్వారా పోలింగ్ పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. మొత్తం 150 డ్రోన్ కెమెరాలు ఉపయోగిస్తున్నట్లు చెప్పారు.

## అందెశ్రీ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం: సీఎం రేవంత్

ఘట్‌కేసర్: అందెశ్రీ మరణం వ్యక్తిగతంగా తనకు, తెలంగాణ సమాజానికి తీరని లోటు అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో రాష్ట్రం గురించి అనేక విషయాలు ఆయనతో చర్చించినట్లు తెలిపారు. జయ జయహే తెలంగాణను రాష్ట్ర గీతంగా నిర్ణయించిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. అందెశ్రీ అంత్యక్రియల అనంతరం ఘట్‌కేసర్‌లో రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "అందెశ్రీ ప్రతి మాట ప్రజా జీవితంలో నుంచి పుట్టుకొచ్చింది.. ప్రతి పాట తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపింది. జయ జయహే తెలంగాణ గీతాన్ని పాఠ్య పుస్తకాల్లో చేరుస్తాం. అందెశ్రీ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తాం. తన జీవితాన్ని ప్రజల కోసం త్యాగం చేసిన మహనీయుడు ఆయన. ఆయన రచనలకు సంబంధించిన 'నిప్పులవాగు' పుస్తకాన్ని ప్రతి గ్రంథాలయంలో అందుబాటులో ఉంచుతాం." అని రేవంత్‌రెడ్డి తెలిపారు.





## మొంథా తుపాను.. దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం మంజూరు

హైదరాబాద్: రాష్ట్రంలో మొంథా తుపాను బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం మంజూరు చేసింది. దెబ్బతిన్న ఇళ్ల మరమ్మతులకు రూ.12.99 కోట్లు విడుదల చేసింది. 15 జిల్లాల్లోని 8,662 ఇళ్లకు రూ.15వేలు చొప్పున తక్షణ సాయం పంపిణీ చేయనున్నారు. తెలంగాణలో మొంథా తుపాను కారణంగా ఆయా జిల్లాల్లో జరిగిన నష్టంపై ఇప్పటికే జిల్లాల కలెక్టర్లు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. భీకర వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 16 మంది మృతిచెందగా.. వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 14 జిల్లాల్లో తుపాను ప్రభావం చూపినట్లు ఆర్‌అండ్‌బీ శాఖ గుర్తించింది. మొత్తం 334 ప్రాంతాల్లో 230.41 కిలో మీటర్ల రహదారులు దెబ్బతిన్నాయి. 201 రహదారులపై నీరు పొంగిపొర్లింది. 8 రోడ్లకు పగుళ్లు వచ్చాయి. 156 ప్రాంతాల్లో రాకపోకలు ఆగిపోగా.. పలుచోట్ల అధికారులు పునరుద్ధరించారు. 61 చోట్ల కల్వర్టులు పాడయ్యాయి.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. కోడ్ ఉల్లంఘించిన స్థానికేతర ప్రజాప్రతినిధులపై కేసులు

హైదరాబాద్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన స్థానికేతర ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. కోడ్ ఉల్లంఘించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను గుర్తించామన్నారు. కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనధికారికంగా పోలింగ్ బూత్‌ల వద్ద ఉన్నారని చెప్పారు.



*** మా కార్యకర్తలపై కార్పొరేటర్ దాడులు: మాగంటి సునీత**

తమ పార్టీ కార్యకర్తలపై కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ దాడులు చేస్తున్నారని భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి సునీత ఆరోపించారు. దాడులు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా చూసే బాధ్యత పోలీసులదే అని పేర్కొన్నారు.

## గ్రేటర్ లో తాగునీటి సమస్య రాకుండ చూడండి : సీఎస్ సమీక్ష



ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గ్రేటర్ హైదరాబాద్ లో రానున్న రోజుల్లో తాగు నీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో జలమండలి పని తీరుపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంజీరా, సింగూరు, గోదావరి రెండు, మూడో దశ పనులపై సమీక్ష చేశారు. భూసేకరణ, పైప్ లైన్ల నిర్మాణంపై అధికారులతో చర్చించారు. ఇరిగేషన్, రెవెన్యూ, అటవీ, రోడ్లు, భవనాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ నిర్దేశించిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సహకరించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, జలమలండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పీసీసీఎఫ్ డాక్టర్ సి. సువర్ణ, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లా కలెక్టర్లు, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి తదితరలు పాల్గొన్నారు.



## విజయవాడ- దువ్వాడ సెక్షన్ మధ్య పలు రైళ్లు రద్దు

సికింద్రాబాద్: రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా విజయవాడ దువ్వాడ సెక్షన్ మీదుగా నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్టు దక్షిణ మధ్యరైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ పోర్టు విశాఖపట్నం (17267), విశాఖ కాకినాడ పోర్టు (17268), రాజమండ్రి విశాఖ (67285), విశాఖ రాజమండ్రి(67286) మధ్య నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈనెల 20న రద్దు చేసినట్టు పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈనెల 12న నర్సాపూర్ సికింద్రాబాద్, 15న అనకాపల్లిసికింద్రాబాద్‌కు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

## ఏడాదికి రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు టార్గెట్ : మంత్రి

- **రాష్ట్రంలో సాగుకు 12 లక్షల ఎకరాల భూమి అనువుగా ఉంది**
- **మూడేళ్లలో 10 లక్షల ఎకరాల విస్తీర్ణంతో దేశంలో మొదటి స్థానంలో నిలుస్తాం**

తెలంగాణ బ్యూరో : రాష్ట్రాన్ని ఆయిల్ పామ్ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం సచివాలయంలో ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 2.74 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని ఇందులో 73,696 మంది రైతులు భాగస్వామ్యమయ్యారని తెలిపారు. 2021 22 నుండి ఇప్పటి వరకు 2.28 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చినట్టు వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 1.25 లక్షల ఎకరాల లక్ష్యం నిర్ధేశించగా, ఇప్పటివరకు 31,158 ఎకరాల్లో మాత్రమే సాగు జరిగినట్టు చెప్పారు. మార్చి నాటికి మిగిలిన 93,842 ఎకరాలు సాగులోకి రావాల్సి ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగుకు 12 లక్షలకు పైగా అనువైన భూమి ఉంది. వచ్చే నాలుగు సంవత్సరాలపాటు ప్రతి ఏడాది రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా పని చేయాలి. మూడు సంవత్సరాల్లో పది లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగుతో తెలంగాణ దేశంలోనే ఆయిల్ పామ్ ఉత్పత్తిలో మొదటి రాష్ట్రంగా నిలుస్తుందన్నారు. గత ఐదు సంవత్సరాల్లో రాష్ట్రానికి 6.54 లక్షల ఎకరాల లక్ష్యం కేటాయించగా, కేవలం 2.28 లక్షల ఎకరాలు మాత్రమే సాగులోకి వచ్చిందని తెలిపారు. ఆయిల్ పామ్ విస్తరణలో నిర్లక్ష్యం వహించే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తక్కువ పురోగతి ఉన్న జిల్లాలుగా వరంగల్, నారాయణపేట, వనపర్తి, రాజన్న సిరిసిల్ల, గద్వాల్, కరీంనగర్, నిజామాబాద్, జగిత్యాల, ఆదిలాబాద్ జిల్లాలను గుర్తించినట్లు ఈ జిల్లాల్లో ఆయా కంపెనీలు లక్ష్యాలకు అనుగుణంగా వేగంగా పనిచేయాలని ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణలో కంపెనీలు మరింత బాధ్యతతో వ్యవహరించాలని, ప్రతి కంపెనీ తమ పరిధిలోని జిల్లాల్లో సరిపడా సిబ్బందిని నియమించుకుని, రైతులతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉండాలని సూచించారు. తోటల యాజమాన్యంలో నీటి వినియోగం, ఎరువుల



పంపిణీ, అంతర పంటలు, కలుపు నివారణ వంటి అంశాలపై పూర్తి దృష్టి సారించాలన్నారు. కొత్త తోటలలో గెలల దిగుబడులు తగ్గకుండా పర్యవేక్షణ చేయడం, విజయవంతమైన రైతుల అనుభవాలను కొత్త రైతుల ప్రోత్సాహానికి వినియోగించడం అవసరమని సూచించారు. తక్కువ ఎత్తు, తక్కువ ఆకు పొడవు, అధిక దిగుబడి ఇచ్చే కొత్త వెరైటీ మొలకలను దిగుమతి చేసుకోవాలని, రాబోయే ఏడాదికి ఆయిల్ పామ్ మొక్కల డిమాండ్ పెరగనున్నందున ప్రతి కంపెనీ తన లక్ష్యానికి అనుగుణంగా నర్సరీలను ఏర్పాటు చేసుకొని, నాణ్యమైన మొక్కలు రైతులకు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.

# జీపీఎస్ స్పూఫింగ్‌పై.. పైలట్లు, ఏటీసీలకు డీజీసీఏ కీలక సూచన

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో సాంకేతిక సమస్య కారణంగా ఇటీవల వందలాది విమానాలు ఆలస్యంగా నడిచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) కీలక సూచనలు జారీ చేసింది. జీపీఎస్ స్పూఫింగ్ సంఘటనలు చోటుచేసుకున్న 10 నిమిషాల్లోనే సంబంధిత విభాగానికి తెలియజేయాలని విమానయాన సంస్థలు, పైలట్లు, ఏటీసీలకు సూచించింది. దేశంలో అత్యంత రద్దీగా ఉండే ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో ఇటీవల జీపీఎస్ స్పూఫింగ్ చోటుచేసుకున్నట్లు నివేదికలు వెల్లడించాయి. దీంతో రెండు రోజుల పాటు విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో చర్యలు చేపట్టిన డీజీసీఏ.. ఈ సమస్యను రియల్ టైమ్‌లో నమోదు చేసేలా ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జీపీఎస్ అసాధారణ చర్యను ఎవరైనా పైలట్, ఏటీసీ కంట్రోలర్ లేదా టెక్నికల్ యూనిట్



గుర్తించిన వెంటనే సంబంధిత విభాగానికి తెలియజేయాలని డీజీసీఏ తాజా ప్రకటనలో పేర్కొంది. విమానం వివరాలు, ఘటన జరిగిన సమయం, తేదీ, ఏ రూట్‌లో జరిగింది.. అనే వివరాలు కూడా నమోదు చేయాలని సూచించింది. జామింగ్/స్పూఫింగ్/సిగ్నల్ లాస్/ఇంటిగ్రిటీ ఎర్రర్ వంటి విషయాన్ని కూడా స్పష్టంగా తెలియజేయాలని పేర్కొంది. దేశంలో నవంబర్ 2023 ఫిబ్రవరి 2025 మధ్యకాలంలో 465 జీపీఎస్ స్పూఫింగ్ ఘటనలు నమోదైనట్లు అంచనా. అమృత్‌సర్, జమ్మూ సరిహద్దు ప్రాంతాల్లో ఇవి చోటుచేసుకున్నాయి. ఇటీవల అమృత్‌సర్‌కు వచ్చి వెళ్లే అనేక విమానాలు ఈ సమస్యను ఎదుర్కొన్నట్లు తెలిసింది.






## విభు భాస్కర్..
## పదేళ్లకే రెండు ప్రపంచ రికార్డులు

లుథియానా: పంజాబ్‌లోని లుథియానాకు చెందిన విభు భాస్కర్ పదేళ్ల వయసులోనే రెండు ప్రపంచ రికార్డులను సొంతం చేసుకున్నాడు. ఇప్పటివరకు 90 జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీల్లో పాల్గొని అనేక పతకాలు సంపాదించాడు. నిమిషంలోనే 118 రౌండ్‌హౌస్ కిక్‌లు చేసిన విభు.. అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డుల్లో పేరు నమోదు చేసుకున్నాడు. అంతకుముందు గంట 20 నిమిషాలు ఏకధాటిగా లెగ్ స్పిట్లు చేసి ప్రతి ఒక్కర్నీ ఆశ్చర్యపరిచాడు. ఇందుకు వరల్డ్‌వైడ్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సంపాదించాడు. అతి చిన్న వయసులోనే ఆసియా మెడల్, కామన్వెల్త్ మెడల్‌ను సొంతం చేసుకున్న తొలి భారతీయుడిగా ఘనత సాధించాడు. విభు భాస్కర్ లుథియానాలోని రుర్కా కలాన్ గ్రామానికి చెందిన విద్యార్థి. మూడేళ్ల క్రితం కరాటే మొదలుపెట్టిన విభు.. ఇప్పటివరకు 90 టోర్నమెంట్‌లలో పాల్గొన్నాడు. ఇందులో పది అంతర్జాతీయ పోటీలు ఉన్నాయి. ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం గెలుపొందడంతోపాటు నేషనల్ చిల్డ్రన్ అవార్డులకు నామినేట్ అయ్యాడు. గిన్నిస్ వరల్డ్ రికార్డులకు నామినేట్ కాగా త్వరలోనే ఆ బృందం విభు ప్రదర్శనను పరిశీలించనుంది. వచ్చే ఏడాది జరగనున్న కామన్వెల్త్, ఆసియా యూత్ ఛాంపియన్‌షిప్ కామన్వెల్త్‌తోపాటు వరల్డ్ కరాటే ఛాంపియన్‌షిప్‌నకు సిద్ధమవుతున్నట్లు విభు వెల్లడించాడు.

## ఢిల్లీ ఘటన.. ప్రతి ఒక్కర్ని వేటాడతాం: అమిత్ షా

ఢిల్లీ పేలుడు ఘటన వెనుక ఉన్న ప్రతి ఒక్కర్ని వేటాడాలని ఆదేశించినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. ఎర్రకోట సమీపంలో పేలుడు నేపథ్యంలో.. దేశ రాజధాని ఢిల్లీతోపాటు దేశవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో భద్రతపై నేడు ఉన్నతాధికారులతో రెండు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. పేలుడు అనంతర పరిస్థితులను ఉన్నతాధికారులు ఈ సందర్భంగా కేంద్రమంత్రికి వివరించారు. "ఢిల్లీ కారు పేలుడుపై సీనియర్ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించాను. ఈ ఘటన వెనుక ఉన్న ప్రతి నిందితుడిని వేటాడాలని వారికి ఆదేశించాను. ఈ పేలుడులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిపై దర్యాప్తు సంస్థలు ఉక్కుపాదం మోపుతాయి" అని సమావేశాల అనంతరం అమిత్ షా ట్వీట్ చేశారు. ఈ ఘటనపై అత్యున్నత దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగాయని, సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నాయని అంతకుముందు చెప్పారు. ఈ క్రమంలోనే కేంద్ర హోంశాఖ ఈ పేలుడు కేసును జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఉదయం నిర్వహించిన భేటీలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ కుమార్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సతీష్ గోల్చా, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) డైరెక్టర్ జనరల్ సదానంద్ వసంత్ పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్ డీజీపీ నళిన్ ప్రభాత్



వర్చువల్‌గా హాజరయ్యారు. రెండో సమావేశంలోనూ దాదాపు ఈ ఉన్నతాధికారులే పాల్గొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

## ఢిల్లీలో బాంబు భయాలు.. ఎమర్జెన్సీ నంబర్లకు ఫోన్ల తాకిడి!

ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో పేలుడు ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇది చోటుచేసుకున్న గంటల వ్యవధిలో అత్యవసర నంబర్లకు ఫోన్ల తాకిడి పెరిగిందట. బాంబు భయాలతో అనేకమంది తమను సంప్రదించినట్లు ఢిల్లీ అగ్నిమాపక సేవల అధికారులు తెలిపారు. పేలుడు వార్త జనాల్లో వ్యాపించిన వెంటనే ఫోన్ కాల్స్ రావడం ప్రారంభమయ్యాయని, నగరవ్యాప్తంగా ప్రజల్లో నెలకొన్న ఆందోళనను ఇది ప్రతిబింబించిందని చెప్పారు. "సోమవారం రాత్రి 9.15 గంటల సమయంలో బిజ్వాసన్ నుంచి ఓ ఫోన్ వచ్చింది. ఎవరిదో తెలియని ఓ బ్యాగ్ గురించి ఫిర్యాదు చేశారు. వెంటనే ఓ అగ్నిమాపక శకటాన్ని



అక్కడికి తరలించాం. కానీ, అనుమానాస్పద వస్తువులేమీ కనిపించలేదు. 12 నిమిషాల అనంతరం మరో కాల్ వసంత్ విహార్ నుంచి వచ్చింది. గుర్తుతెలియని కారు ఉందని చెప్పారు. అక్కడా తనిఖీలు నిర్వహించాం. 9.34కు ద్వారకాలోని సెక్టార్ 13 నుంచి, 9.35కు కశ్మీర్ గేట్ నుంచి, 10.01కు ఖజూరీ ఖాస్ నుంచి ఇలా ఫోన్లు వచ్చాయి" అని అధికారులు తెలిపారు. అన్ని కేసుల్లోనూ ప్రమాదకరమైనవి ఏవీ తేలలేదని అధికారులు చెప్పారు. ఎర్రకోట సమీపంలో పేలుడు దృష్ట్యా.. స్థానిక పోలీసుల సమన్వయంతో ప్రతి ఫోన్ కాల్‌ను సీరియస్‌గా పరిగణించినట్లు తెలిపారు. పేలుడు ఘటన అనంతరం స్థానికుల్లో ఆందోళన నెలకొందన్న విషయాన్ని ఇది తెలుపుతోందన్నారు. ప్రజల్లో భయాన్ని తొలగించేందుకు తమ బృందాలు వేగంగా స్పందించాయని వెల్లడించారు. ఢిల్లీ పేలుడు కేసులో 12 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.

## ఢిల్లీ పేలుడు..
## కొత్తగా మరికొన్ని సీసీటీవీ దృశ్యాలు



దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటనపై అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ పేలుడుకు కారణమైన కారుకు సంబంధించిన మరికొన్ని సీసీటీవీ దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. హరియాణాలోని ఫరీదాబాద్ నుంచి ఎర్రకోట వరకు ఐ20 కారు జర్నీని దర్యాప్తు అధికారులు ట్రేస్ చేస్తున్నారు. ఈ క్రమంలో బదర్‌పుర్ టోల్‌ప్లాజా వద్ద కొత్త ఫుటేజీ లభ్యమైంది. అందులో నిందితుడు ముఖానికి మాస్క్ ధరించి ఉన్నట్లు కనిపిస్తోంది. అప్పుడు సమయం సోమవారం ఉదయం 8.13 గంటలు అవుతోంది. అతడు టోల్‌ప్లాజా సిబ్బంది నుంచి రసీదు అందుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఆ ప్రాంతం హరియాణా, ఢిల్లీ సరిహద్దులో ఉంది. ఇదిలా ఉంటే.. ఢిల్లీ పేలుడుకు రెండువారాల క్రితం అదే కారులో ముగ్గురు వ్యక్తులు కనిపించారు. దానికి సంబంధించిన దృశ్యాలు కూడా సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చాయి. అక్టోబర్ 29న సాయంత్రం 4.20 గంటల సమయంలోని ఫుటేజీ అది. హరియాణా నంబర్ ప్లేట్‌తో ఉన్న ఆ ఐ20 కారు నుంచి ముగ్గురు వ్యక్తులు దిగడం కనిపిస్తోంది. ఆ వాహనాన్ని కొనుగోలు చేసిన వెంటనే దానికి కాలుష్య తనిఖీలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఆ ముగ్గురు వ్యక్తులు ఎవరు..? అని పోలీసులు ఆరా తీస్తున్నారు.

## ఆ 3 గంటల్లో ఏం జరిగింది? కీలక అంశాలపై దర్యాప్తు ముమ్మరం!

ఢిల్లీ ఎర్రకోట సమీపంలో చోటుచేసుకున్న పేలుడు ఘటనపై భద్రతా సంస్థలు దర్యాప్తు ముమ్మరం చేశాయి. అనుమానితుల కదలికలు, ఘటనలో ఉపయోగించిన పేలుడు పదార్థాల స్వభావం, ఫరీదాబాద్‌లోని ఓ యూనివర్సిటీకి చెందిన నెట్‌వర్క్‌పైనా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో ప్రధాన అనుమానితుడిగా భావిస్తున్న డాక్టర్ ఉమర్ చివరి మూడు గంటల్లో ఏం చేశాడనే అంశం అత్యంత కీలకంగా మారింది.

### హై సెక్యూరిటీ జోన్ ఎందుకు..?

సోమవారం మధ్యాహ్నం 3:19 గంటలకు ఎర్రకోట పార్కింగ్ ప్రదేశానికి వచ్చిన కారు.. సాయంత్రం 6:22 గంటల వరకు అక్కడే ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆ సమయంలో అందులోని అనుమానితులు ఒక్కసారి కూడా కిందకు దిగలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో డాక్టర్ ఉమర్ ఆ మూడు గంటలు ఏం చేశాడు? వాహనంలోనే ఉండిపోయాడా? ఆ సమయంలో ఎవరినైనా కలిశాడా? అనే కోణాలపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. పేలుడుకు ముందు.. రోడ్లపై ఎక్కువ రద్దీ ఉండే సమయం కోసం వేచి ఉన్నాడా? అనే విషయంపైనా దర్యాప్తు చేస్తున్నారు. దాదాపు మూడు గంటల పాటు వేచి చూసేందుకు కట్టుదిట్టమైన భద్రత ఉండే హై సెక్యూరిటీ జోన్‌ను ఎందుకు ఎంచుకున్నాడనే ప్రశ్నలు కూడా వస్తున్నాయి. పేలుడు కోసం స్లీపర్ సెల్ నుంచి ఆదేశాల కోసం లేదా లాజిస్టిక్ సాయం కోసం అతడు అక్కడ ఎదురుచూసి ఉండవచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి.

### భారీ నెట్‌వర్క్..?

ఢిల్లీ ఎర్రకోట పేలుడు, ఫరీదాబాద్‌లో పెద్దఎత్తున పేలుడు పదార్థాల స్వాధీనం వెనుక భారీ నెట్‌వర్క్ ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫరీదాబాద్‌లోని యూనివర్సిటీకి చెందిన వారి పేర్లు ఇప్పటికే బయటకు వచ్చాయి. జైషే మహ్మద్ సంస్థతో సంబంధాలపై అనుమానాలతో



10 రోజుల క్రితమే ఓ వైద్య అధ్యాపకుడు అరెస్టయ్యాడు. ఈ నేపథ్యంలో స్లీపర్ సెల్స్‌గా ఎవరైనా పనిచేశారా?, ఇటీవల భారీ స్థాయిలో స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు, ఆయుధాలు ఎక్కడ నుంచి తీసుకువచ్చారనే విషయాలపైనా దర్యాప్తు కొనసాగుతోంది. సంప్రదింపుల కోసం ఉపయోగించిన సోషల్ మీడియా ఖాతాల్లోనూ ఇతర సభ్యులు, నెట్‌వర్క్ వెనుక ఉన్నవారిని గుర్తించే పనిలో దర్యాప్తు సంస్థలు నిమగ్నమయ్యాయి.

## దేశాన్ని వణికించిన నిఠారీ హత్యల కేసు..
## నిర్దోషిగా విడుదలైన సురేందర్ కోలీ

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2005 06 నిఠారీ వరుస హత్యల కేసులో సుప్రీం కోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. ఈ ఘటనకు సంబంధించిన పలు కేసుల్లో దోషిగా తేలి మరణశిక్ష ఎదుర్కొంటున్న సురేందర్ కోలీని నిర్దోషిగా తేల్చింది. ఈ కేసులకు సంబంధించి అతడిపై ఉన్న ఆరోపణలపై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన ధర్మాసనం సురేందర్ కోలీని వెంటనే విడుదల చేయాల్సిందిగా అధికారులను ఆదేశించింది. నిఠారీ హత్యల్లో ఒకటైన 15 ఏళ్ల బాలిక హత్య కేసులో సురేందర్ కోలీ ప్రస్తుతం జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. ఈ కేసుపై తాజాగా విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం కేవలం ఒక కత్తి ఆధారంగా అతడిని నిందితుడిగా భావించలేమని పేర్కొంది. ఇప్పటికే 12 కేసుల్లో అతడు నిర్దోషిగా తేలినందువల్ల సురేందర్ కోలీని విడుదల చేయాలని ఆదేశించింది. 2006లో నొయిడాలోని నిఠారీ వద్ద మోనిందర్‌సింగ్ పంధేర్ ఇంటి వెనుక మురుగుకాల్వలో 16 మంది చిన్నారుల అస్థికలు



బయటపడటం తీవ్ర కలకలం సృష్టించింది. ఈ కేసుల్లో దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. పంధేర్‌తోపాటు అతడి ఇంట్లో సహాయకుడైన కోలీని అరెస్టు చేసింది. ఈ వ్యవహారంలో మొత్తం 19 కేసులను 2007లో నమోదు చేసింది. తగిన సాక్ష్యాధారాలు లేకపోవడంతో వాటిలో మూడింటిని మూసివేసింది. మిగతా 16 కేసులకుగాను పన్నెండింటిలో కోలీని నిర్దోషిగా 2023 అక్టోబరు 16న అలహాబాద్ హైకోర్టు తేల్చింది. అప్పటికి పంధేర్‌పై మూడు కేసులు మిగిలి ఉండగా.. వాటిలో అతణ్నీ నిర్దోషిగా నిర్ధారించింది. దర్యాప్తులో సీబీఐ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, నిందితులే నేరం చేసినట్టు ప్రాసిక్యూషన్ రుజువు చేయలేకపోయిందని వ్యాఖ్యానించింది.

## ఐఏఎస్ అధికారిణికి గృహహింస వేధింపులు..
## ఐఏఎస్ భర్తపై కేసు నమోదు

ఐఏఎస్ అధికారి అయిన తన భర్త గృహహింస వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ..ఓ ఐఏఎస్ అధికారిణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన రాజస్థాన్‌లో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ ప్రభుత్వ ఆర్థిక శాఖలో జాయింట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న భారతి దీక్షిత్ అనే ఐఏఎస్ అధికారిణి గృహహింస వేధింపుల నేపథ్యంలో ఇటీవల జైపూర్ పోలీసులను ఆశ్రయించారు. సామాజిక న్యాయం, సాధికారత



విభాగంలో డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న తన భర్త.. ఐఏఎస్ అధికారి ఆశిష్ వివాహం అయినప్పటి నుంచి తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని, ఈ మధ్య వేధింపులు తీవ్రమయ్యాయని భారతి దీక్షిత్ ఆరోపించారు. అత్తింటివారి నుంచి తన ప్రాణాలకు హాని ఉందని జైపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తామిద్దరం 2014 బ్యాచ్‌కు చెందిన రాజస్థాన్ కేడర్ ఐఏఎస్ అధికారులమని భారతి దీక్షిత్ ఫిర్యాదులో పేర్కొన్నారు. 2014లో తమ వివాహం అయినప్పటి నుంచి ఆశిష్ మోదీ తరచూ మద్యం సేవించి..తనను శారీరకంగా, మానసికంగా హింసించేవాడని పేర్కొన్నారు. పలువురు నేరస్థులతోనూ ఆయనకు సంబంధాలున్నాయన్నారు. ఈ మధ్య కాలంలో వేధింపులు మరీ ఎక్కువయ్యాయని.. గత నెలలో ఆశిష్ అతడి స్నేహితులతో కలిసి తనను ఓ ప్రభుత్వ వాహనంలో అపహరించి, చాలా గంటలపాటు నిర్బంధంలో ఉంచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విడాకులకు అంగీకరించకపోతే తనను, తన కుటుంబాన్ని చంపేస్తామని బెదిరించారని ఆరోపించారు. దీంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. అతన్ని సంప్రదించడానికి ఎంత ప్రయత్నించినప్పటికీ అందుబాటులోకి రాకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## డబ్బా నిండా నాణేలు.. చాయ్‌వాలా స్కూటర్ కొనుగోలు

చంద్రకోన: పశ్చిమ బెంగాల్‌లోని చంద్రకోన ప్రాంతానికి చెందిన బచ్చు చౌదరీ అనే చాయ్‌వాలా.. స్కూటర్ కొనాలనే తన చిరకాల కోరిక నెరవేర్చుకున్నారు. దీని కోసం షోరూంలో ఆయన మొత్తం రూ.1.10 లక్షలు కట్టగా.. అందులో రూ.69,580 మేర రూ.10 విలువైన నాణేలతోనే చెల్లించడం గమనార్హం. గత నాలుగున్నరేళ్లుగా జమ చేసిన ఆ నాణేలను.. ఓ ప్లాస్టిక్ డబ్బాలో షోరూంకు తరలించారు. వాటిని లెక్కించేందుకు నిర్వాహకులకు రెండున్నర గంటల సమయం పట్టిందట. చాయ్ దుకాణానికి వచ్చే వినియోగదారుల నుంచి ఈ బిళ్లలను సేకరించినట్లు చెప్పారు. స్కూటర్ కొనుగోలుతో తన కుమార్తె కల కూడా నెరవేరినట్లు తెలిపారు.

# లాభాల్లో ముగిసిన మార్కెట్లు..

## 335 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్..!



**ముంబై:** భారత స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. వరుసగా రెండోసెషన్‌లోనూ లాభపడ్డాయి. ప్రపంచ మార్కెట్‌లో సానుకూల పవనాల మధ్య మార్కెట్లు దూసుకెళ్లాయి. ఉగ్రదాడి నేపథ్యంలో పెట్టుబడిదారులు ఆందోళనకు గురవడంతో తొలి అర్ధభాగంలో మార్కెట్‌లో ఒడిదుడుకులను ఎదుర్కొన్నది. అయితే, మధ్యాహ్నం సెషన్‌లో ఆటో, మెటల్, ఐటీ రంగంలో కొనుగోళ్లతో లాభాల్లోకి దూసుకెళ్లాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,671.52 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 83,124.03 పాయింట్ల కనిష్టానికి చేరుకున్న సెన్సెక్స్.. గరిష్టంగా 83,936.47 పాయింట్లకు పెరిగింది. చివరకు 335.97 పాయింట్ల లాభంతో 83,871.32 వద్ద ముగిసింది. నిఫ్టీ 120.6 పాయింట్లు పెరిగి 25,694.95 వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. నిఫ్టీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, భారత్ ఎలక్ట్రానిక్స్, బజాజ్ ఆటో, ఎంఅండ్ఎం, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లాభాలను ఆర్జించాయి. బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఓఎన్‌జీసీ, టీఎంపీవీ, పవర్ గ్రిడ్ నష్టపోయాయి.

పీఎస్‌యూ బ్యాంక్, హెల్త్‌కేర్ ఒక్కొక్కటి 0.3శాతం తగ్గాయి. టెలికాం ఇండెక్స్ 1.5 శాతం పెరగ్గా.. ఐటీ ఇండెక్స్ ఒకశాతం పెరిగింది. ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 0.7 శాతం, ఆటో ఇండెక్స్ ఒకశాతం, మెటల్ ఇండెక్స్ 0.6 శాతం పెరిగింది. క్యూ-2 ఆదాయాల తర్వాత బజాజ్ ఫైనాన్స్ షేర్ ధర 7 శాతం పడిపోయాయి. క్యూ 2 నష్టాలు తగ్గడంతో వోడాఫోన్ ఐడియా షేర్లు 8 శాతం పెరిగాయి. యూఎస్‌తో వాణిజ్య ఒప్పందంపై గోకల్దాస్ ఎక్స్‌పోర్ట్స్ షేర్లు 5 శాతం వృద్ధి చెందాయి. రెడెరియట్ స్టెనర్సన్ ఏఎస్‌తో ఎల్‌ఓఐపై సంతకం చేయడంతో స్వాన్ డిఫెన్స్ షేర్ ధర 5 శాతం పెరిగింది. సీఈవో రాజీనామాతో బ్రిటానియా ఇండస్ట్రీస్ షేర్ ధర 3 శాతం పతనమైంది. కూ2 నష్టాలు తగ్గడంతో అథర్ ఎనర్జీ షేర్లు 7శాతం వృద్ధిని నమోదు చేశాయి. క్రాఫ్ట్స్‌మన్, భారత్ ఫోర్జ్, బీహెచ్ఈఎల్, నాల్కో, అశోక్ లేలాండ్, హిటాచి ఎనర్జీ, ఎం అండ్ ఎం, అసహి ఇండియా, ముత్తూట్ ఫైనాన్స్, కెన్ ఫిన్ హోమ్స్, ఐఓసీ, శ్రీరామ్ ఫైనాన్స్, టోరెంట్ ఫార్మా, ఎంసిఎక్స్ ఇండియా, లారస్ ల్యాబ్స్ వంటి వందకంటే ఎక్కువ స్టాక్‌లు ఈఎస్ఇలో 52 వారాల గరిష్ట స్థాయిని తాకాయి.

# బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీలోకి అదానీ..

## దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్ట్



**న్యూఢిల్లీ:** గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్ రంగంలోకి ప్రవేశించింది. కంపెనీ పునరుత్పాదక ఇంధన లక్ష్యాలను చేరుకోవడంలో భాగంగా ఈ ముందడుగు వేసింది. 3530 మెగావాట్ అవర్ సామర్థ్యంతో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్ట్ 2026 మార్చి నాటికి అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా 700కు పైగా బీఈఎస్ఎస్ కంటెయినర్లు ఏర్పాటు చేస్తున్నారు. దేశంలోనే ఒకే చోట ఏర్పాటువుతున్న అతిపెద్ద ఇంధన స్టోరేజీ ప్రాజెక్ట్ ఇదే కావడం గమనార్హం. ప్రపంచంలోని అతిపెద్ద ప్రాజెక్టుల్లో ఇదీ ఒకటి.

పునరుత్పాదక ఇంధనానికి ఎనర్జీ స్టోరేజీ అనేది మూలస్తంభం లాంటిదని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇదో చరిత్రాత్మక ప్రాజెక్ట్‌గా అభివర్ణించారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశ ఇంధన రంగంలో స్వావలంబన, సుస్థిరతకు తమ గ్రూప్ మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు. దీనివల్ల నమ్మకమైన, స్వచ్ఛమైన, అందుబాటు ధరలో విద్యుత్ లభిస్తుందని తెలిపారు.

దేశ ఇంధన భద్రతకు, 24 గంటలూ కర్బన ఉద్గారాల్లేని స్వచ్ఛమైన ఇంధనాన్ని అందించడం ఈ ప్రాజెక్ట్ ఉద్దేశమని కంపెనీ తన ప్రకటనలో పేర్కొంది. పీక్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో ఈ ప్రాజెక్ట్ కీలక భూమిక పోషించనుందని తెలిపింది. సరఫరా వృథాను తగ్గించడం, సూర్యుడు అందుబాటులో లేని సమయంలోనూ గ్రిడ్‌పై ఒత్తిడి పడకుండా ఇంధన సామర్థ్యాన్ని పెంచడం ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశమని పేర్కొంది. లిథియం ఐయాన్ బ్యాటరీ టెక్నాలజీ, అత్యాధునిక ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో కూడిన ఈ ప్లాంట్‌ను గుజరాత్‌లోని ఖవ్డాలో కంపెనీ ఏర్పాటు చేస్తోంది. 2026 నాటికి అందుబాటులోకి తెచ్చేందుకు శరవేగంగా పనులు జరుగుతున్నాయి. 2027 మార్చి నాటికి మరో 15 గిగావాట్ అవర్‌ను కెపాసిటీని పెంచేందుకు అదానీ గ్రూప్ సన్నాహాలు చేస్తోంది. ఐదేళ్లలో 50% సామర్థ్యాన్ని పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ అనేది విద్యుత్ శక్తిని రసాయనిక రూపంలో నిల్వ చేసి, అవసరమైనప్పుడు తిరిగి వాడుకోవడం ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం. ముఖ్యంగా సౌర, గాలి వంటి పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి వచ్చే విద్యుత్‌ను స్థిరీకరించడానికి, గ్రిడ్‌ను సమతుల్యం చేయడానికి వీటిని వినియోగిస్తుంటారు. బ్లాక్‌అవుట్ సమయాల్లోనూ బ్యాకప్ పవర్‌గా ఇది ఉపయోగపడుతుంది.

# నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.12.92 లక్షల కోట్లు



**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఇప్పటి వరకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.12.92 లక్షలుగా నమోదయ్యాయి. కార్పొరేట్ పన్ను వసూళ్లు పెరగడం, రీఫండ్‌లు తగ్గడంతో గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఇదే సమయంతో పోలిస్తే 7 శాతం పెరిగాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 10 మధ్య రీఫండ్ జారీలు 18 శాతం తగ్గి రూ.2.42 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. ఇదే కాలంలో కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.5.37 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే సమయానికి నమోదైన రూ.5.08 లక్షల కోట్లతో పోల్చితే కార్పొరేట్ పన్ను వసూళ్లు పెరిగాయి.

ఇక వ్యక్తిగత పన్ను, హెచ్‌యూఎఫ్‌ల పన్ను వసూళ్లు రూ.7.19 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే సమయంలో ఈ మొత్తం రూ.6.62 లక్షల కోట్లుగా ఉంది. సెక్యూరిటీల లావాదేవీ పన్ను (ఎస్‌టీటీ) వసూళ్లు మాత్రం స్వల్పంగా తగ్గి రూ.35,682 కోట్లుగా నమోదయ్యాయని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.25.20 లక్షల కోట్లను ప్రభుత్వం ప్రత్యక్ష పన్ను వసూళ్ల లక్ష్యంగా నిర్ణయించుకుంది. గతేడాదితో పోల్చితే ఈ మొత్తం 12.7 శాతం ఎక్కువ. అలాగే ఎస్‌టీటీ వసూళ్ల లక్ష్యాన్ని రూ.78,000 కోట్లుగా నిర్ణయించింది.



# కరోనా తర్వాత తొలి టెస్టు..

## ఈడెన్ గార్డెన్స్‌లో భారత క్రికెటర్ల సాధన..!

**కోల్‌కతా:** సొంతగడ్డపై భారత జట్టుకు ఈసారి దక్షిణాఫ్రికా రూపంలో పరీక్ష ఎదురవుతోంది. ఇటీవలే వెస్టిండీస్‌ను వైట్‌వాష్ చేసిన టీమిండియా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ విజేతలైన సఫారీలను నిలువరించేందుకు పక్కాగా సిద్ధమవుతోంది. ఆస్ట్రేలియా పర్యటన ముగియడంతో స్వదేశం చేరుకున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సేన బ్యాటుతో చెలరేగాలనే పట్టుదలతో ఉన్నాడు. తొలి టెస్టుకు ఇంకా రెండు రోజులే ఉండడంతో.. మంగళవారం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ పిచ్‌ను కోచ్ గంభీర్‌తో కలిసి గిల్ పరిశీలించాడు.

స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో క్లీన్‌స్వీప్ తర్వాత మళ్లీ విజయాల బాట పట్టింది టీమిండియా. డబ్ల్యూటీసీ తొలి పోరులో ఇంగ్లండ్ గడ్డపై సిరీస్ సమం చేసిన శుభ్‌మన్ గిల్ బృందం.. వెస్టిండీస్‌ను చిత్తుగా ఓడించి పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. ఇప్పుడు టీమిండియాకు సవాల్ విసిరేందుకు దక్షిణాఫ్రికా కాచుకొని ఉంది.

తెంబా బవుమా నేతృత్వంలోని పటిష్టమైన సఫారీల జట్టుకు చెక్ పెట్టాలంటే కాస్త కష్టపడాల్సిందే. అందుకే.. ఆస్ట్రేలియా పర్యటనలో పెద్దగా రాణించని గిల్ తనకు



కలిసొచ్చిన సుదీర్ఘ ఫార్మాట్‌లో భారీ స్కోర్లు చేయాలనే పట్టుదలతో ఉన్నాడు. సహచరుల కంటే ముందే నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్‌తో చెమటోడ్చాడు భారత సారథి. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ కాసేపు బ్యాటింగ్ సాధన చేశాడు. బుమ్రా, సిరాజ్, కుల్దీప్, జడేజా, సుందర్ సైతం బౌలింగ్ ప్రాక్టీస్ చేశారు.

### కరోనా తర్వాత తొలి టెస్టు

భారత్, దక్షిణాఫ్రికాల మధ్య నవంబర్ 14న ఈడెన్ గార్డెన్స్‌లో ఉదయం 9:30 గంటలకు తొలి టెస్టు ప్రారంభం కానుంది. కరోనా తర్వాత ఈడెన్స్‌లో జరుగనున్న తొలి టెస్టు మ్యాచ్ ఇదే. దాంతో.. అభిమానులు భారీగా స్టేడియానికి తరలివచ్చే అవకాశముంది. రెండో దఫా బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సౌరవ్ గంగూలీ మ్యాచ్‌కు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాడు.

# తల్లి కాబోతున్న టెన్నిస్ స్టార్..

## కొన్నాళ్లు 'ఆటకు బ్రేక్' అంటూ పోస్ట్..!

**ఆఫ్రికా:** మహిళల టెన్నిస్‌లో ఒకప్పటి సంచలనం ఓన్స్ జుబెర్ అభిమానులకు తీపికబురు చెప్పింది. మాజీ వరల్డ్ నంబర్ 2 అయిన జుబెర్ తాను తల్లి కాబోతున్నానని వెల్లడించింది. ఈ విషయాన్ని నవంబర్ 10(సోమవారం)న ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా ఫ్యాన్స్‌తో పంచుకుంది జుబెర్. మొదటిసారి తల్లి అవుతున్నందుకు చాలా సంతోషంగా ఉందని చెబుతున్న టెన్నిస్ స్టార్.. ప్రెగ్నెన్సీ కారణంగా కొన్నాళ్లు ఆటకు దూరం అవుతున్నట్టు పేర్కొంది.

'కొత్త ఉత్సాహం కోసం టెన్నిస్ నుంచి చిన్న బ్రేక్ తీసుకుంటున్నా. మేము త్వరలోనే క్యూట్ బేబీని ఆహ్వానించబోతున్నాం. అందుకే కొన్నిరోజులు ఆటకు దూరమవుతున్నాను. ఏప్రిల్‌లో మేము ముగ్గురం కాబోతున్నాం.' అని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా జుబెర్ రాసుకొచ్చింది. ఆమె పోస్ట్ చూసిన టెన్నిస్ స్టార్లు కాబోయే పేరెంట్స్‌కు అభినందనలు తెలుపుతున్నారు.

ఇన్‌స్టా పోస్ట్‌లో ఓన్స్, ఆమె భర్త కరీమ్ కమౌన్‌లు చిన్న రాకెట్, చిన్న డ్రెస్‌ను చూపిస్తూ మేము తల్లిదండ్రులం కాబోతున్నాం అని వెల్లడించారు. దాంతో, మరియా సక్కారి, దరియా కసత్కిన, బెలిండా బెన్సిక, బర్బొరా క్రెజికోవా, నవొమి ఒసాకా, కరోలిన్ వోజ్నియాకి, తదితరులు జుబెర్ దంపతులకు శుభాకాంక్షలు చెప్పారు. ట్యునీషియాకు చెందిన జుబెర్ 2015లో ఫెన్సర్ అయిన కరీమ్ కమౌన్‌ను పెళ్లి చేసుకుంది. ఆ తర్వాత అతడు ఆమెకు ఫిట్‌నెస్



కోచ్‌గా మెలకువలు నేర్పాడు.

### తొలి ఆఫ్రికా ప్లేయర్‌గా

మూడేళ్ల క్రితం డబ్ల్యూటీఏ టూర్‌లో జుబెర్ చెలరేగింది. వరుస విజయాలతో జోరు చూపించిన తను.. వరల్డ్ నంబర్ 2 ర్యాంక్ కైవసం చేసుకుంది. తద్వారా ఈ ఘనత సాధించిన మొదటి ఆఫ్రికా, అరబ్ ప్లేయర్‌గా రికార్డు సృష్టించింది జుబెర్. ఆ తర్వాత కూడా అదే విధంగా ఆడిన తను.. మూడుసార్లు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్ (వింబుల్డన్ 2022, 2023, యూఎస్ ఓపెన్ 2022) చేరింది. అదే ఉత్సాహంతో ఐదు డబ్ల్యూటీఏ సింగిల్ టైటిళ్లు గెలుపొందింది. అయితే.. కెరీర్ గొప్పగా సాగుతున్న వేళ ఈ ఏడాది ఆరంభంలో జుబెర్ మానసిక, శారీరక ఆరోగ్యంపై దృష్టి సారించేందుకు బ్రేక్ తీసుకుంది.

# అబుధాబీలోనే ఐపీఎల్ వేలం..

## డిసెంబర్ 15 లేదా 16న ఫిక్స్..!

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ రిటెన్షన్ గడువు సమీపిస్తోంది. మరో నాలుగు రోజుల్లో ఫ్రాంచైజీలు తాము అట్టిపెట్టుకున్న ఆటగాళ్ల జాబితాను వెల్లడించాల్సి ఉంది. ఆ తర్వాత వేలంలో కొనాల్సిన క్రికెటర్ల గురించి కసరత్తు చేస్తారు పది జట్ల యాజమానులు. అయితే.. వేలం ఎక్కడ జరుగనుంది? ఏ తేదీన నిర్వహిస్తారు? అనే విషయాలపై మాత్రం ఉత్కంఠ వీడడం లేదు. గత రెండు సీజన్లకు విదేశాల్లోనే వేలం పాట నిర్వహించారు. ఈసారి కూడా అదే ఆనవాయితీ కొనసాగిస్తారనే వార్తలు వినిస్తున్నాయి. అలానే తేదీలపై కూడా సందిగ్ధం కొనసాగుతోంది.

ఐపీఎల్ 19వ సీజన్ వేలంను డిసెంబర్ 15న లేదంటే డిసెంబర్ 19న నిర్వహిస్తామని ఇదివరకే నిర్వాహకులు చెప్పారు. ఇప్పుడు మాత్రం ఈ తేదీలు మారేలా ఉన్నాయి. డిసెంబర్ 1న లేదా డిసెంబర్ 16న ఆక్షన్ ఉంటుందని సమాచారం. ఊహించినట్టుగానే ఈసారి కూడా గల్ఫ్ దేశాల్లోనే వేలం ఉండనుంది.

పదిహేడో సీజన్ వేలం దుబాయ్‌లో, 18వ సీజన్ మెగా వేలం సౌదీ అరేబియాలోని జెడ్డా నగరంలో జరిగాయి. 19వ సీజన్ మినీ వేలం అబుధాబీలో నిర్వహిస్తారని టాక్. ఈ వేదికను ఖరారు చేసినట్టు ఫ్రాంచైజీలకు నిర్వాహకులు చెప్పారని తెలుస్తోంది. అయితే.. ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ లేదా బీసీసీఐ అధికారికంగా ప్రకటన చేయడమే తరువాయి అంటున్నాయి



సన్నిహిత వర్గాలు. నవంబర్ 15 సాయంత్ర వరకూ రిటెన్షన్ జాబితాను ఫ్రాంచైజీలు ఇచ్చేస్తాయి. దాంతో.. ఏ ఫ్రాంచైజీ ఎవరిని రీటైన్ చేసుంది? వేలంలో నిలిచేది ఎవరు? అనేది ఆరోజే తెలియనుంది.

### రికార్డు ధర పలికేది ఎవరు?

ఐపీఎల్ వేలంలో వస్తుందంటే చాలు రికార్డు ధర పలికేది ఎవరు? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఫ్రాంచైజీలు కూడా ప్రతిభావంతులపై కోట్లు కుమ్మరించేందుకు వెనుకాడవు. గత సీజన్‌లో రిషభ్ పంత్ రూ.27 కోట్లతో అత్యధిక ధర పలుకగా.. శ్రేయాస్ అయ్యర్ రూ.26.75 కోట్లతో రెండో స్థానంలో నిలిచాడు. పంత్‌ను లక్నో సూపర్ జెయింట్స్, అయ్యర్‌ను పంజాబ్ కింగ్స్ కొనగా.. వెంకటేశ్ అయ్యర్‌ను రూ.23.75 కోట్లకు కోల్‌కతా నైట్ రైడర్స్ అట్టిపెట్టుకుంది.

# రంజీల్లో జమ్ముకశ్మీర్ సంచలనం..

## 65 ఏళ్లలో ఢిల్లీపై తొలి విజయం..!

**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీలో మరో సంచలనం నమోదైంది. మేఘాలయ బ్యాటర్ ఆకాశ్ కుమార్ చౌదరి ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీతో రికార్డు నెలకొల్పగా.. దేశవాళీలో పెద్ద జట్టైన ఢిల్లీపై జమ్ము కశ్మీర్ జయభేరి మోగించింది. 65 ఏళ్లలో మాజీ ఛాంపియపై ఆ జట్టుకు ఇదే తొలి విజయం. కమ్రాన్ ఇక్బాల్(133 నాటౌట్), అకీబ్ నబీ(5-35), వన్షాజ్ శర్మ(6-68) బంతితో చెలరేగడంతో దశాబ్దాల కలను సాకారం చేసుకుంది. చిరస్మరణ విజయంతో జమ్ము టీమ్ ఎలైట్ గ్రూప్ డీలో రెండో స్థానానికి ఎగబాకింది.

రంజీ ట్రోఫీలో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన జమ్ము కశ్మీర్ జట్టు ఢిల్లీకి ఊహించని షాకిచ్చింది. పటిష్టమైన ఢిల్లీ బ్యాటింగ్ లైనప్‌ను రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ జమ్ము బౌలర్లు తక్కువకే కట్టడి చేశారు. అకీబ్ నబీ(5-35), వన్షాజ్ శర్మ(6-68)లు విజృంభించి విజయానికి బాటలు వేశారు. అనంతరం 179 పరుగుల ఛేదనలో జమ్ము కశ్మీర్ ఓపెనర్ ఖమ్రాన్ ఇక్బాల్ (133 నాటౌట్) శతకంతో కదం తొక్కాడు. క్రీజులో పాతుకుపోయిన కమ్రాన్‌ను ఔట్ చేసేందుకు ఢిల్లీ బౌలర్లు తీవ్రంగా ప్రయత్నించినా లాభం లేకపోయింది.

తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీని అకీబ్ నబీ కోలుకోలేని దెబ్బ తీశాడు. టాపార్డర్ విఫలమైనా కెప్టెన్ అయుష్ బదొని(64), ఆయుష్ డొసెజా(65), సుమిత్ మథూర్(55) అర్ధ శతకాలతో జట్టును ఆదుకున్నారు. ఆఖర్లో అకీబ్ ముష్తాక్(2-30) తిప్పేయగా ఢిల్లీ 211కే ఆలౌటయ్యింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన జమ్ము కశ్మీర్ సారథి పరాస్ డోగ్రా(106), అబ్దుల్



సమద్(85)ల మెరుపులతో మూడొందలు కొట్టింది.

రెండో ఇన్నింగ్స్‌లోనైనా పెద్ద స్కోర్ చేయాలనుకున్న ఢిల్లీ బ్యాటర్లను వన్షాజ్ శర్మ(6-68) వికెట్ వేటతో హడలెత్తించాడు. ఆయుశ్ బదొని(72), ఆయుశ్ డొసెజ్(65)లు పోరాడినా.. మిడిలార్డర్, టెయిలెండర్లను వన్షాజ్ పెవిలియన్ పంపగా 277కే ఢిల్లీ ఇన్నింగ్స్ ముగిసింది. ప్రత్యర్థి నిర్దేశించిన ఛేదనలో జమ్ము ఓపెనర్ కమ్రాన్ ఇక్బాల్(133 నాటౌట్) సెంచరీతో చెలరేగాడు. ఢిల్లీ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న అతడు.. 20 ఫోర్లు, 3 సిక్సర్లతో జట్టుక చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు.

MOVIE TIME

## రష్మిక మూవీ గర్ల్‌ఫ్రెండ్ సక్సెస్ మీట్
# ముఖ్య అతిథిగా వస్తోన్న విజయ్

**టాకీస్:** నేషనల్ క్రష్ రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో నటించిన సూపర్ హిట్ చిత్రం ది గర్ల్ ఫ్రెండ్ సినిమాకు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించగా.. దీక్షిత్ శెట్టి కథానాయకుడిగా నటించాడు. గీతా ఆర్ట్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. కనిపించబోతుండటంతో ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గర్ల్ ఫ్రెండ్ సినిమా కథ విషయానికి వస్తే.. భూమా (రష్మిక మందన్న) పీజీ చేయడానికి హైదరాబాద్ లోని ఓ కాలేజ్ లో జాయిన్ అవుతుంది. అదే కాలేజ్ లో పీజీ చేయడానికి వచ్చిన విక్రమ్ (దీక్షిత్ శెట్టి) భుమాని చూసి ఇష్టపడతాడు. భూమా కూడా విక్రమ్




వీకెండ్‌తో కాకుండా వీక్ డేస్‌లో కూడా ఈ చిత్రానికి హౌస్ ఫుల్ బోర్డులు కనిపించాయి. అయితే ఈ సినిమా సాధించిన విజయం పట్ల చిత్రబృందం నవంబర్ 12న సక్సెస్ మీట్ నిర్వహించబోతుంది. ఈ సక్సెస్ మీట్‌కు ముఖ్య అతిథిగా స్టార్ నటుడు విజయ్ దేవరకొండ రాబోతున్నట్లు తెలుస్తుంది. దీంతో ఈ వేడుక మరింత గ్రాండ్‌గా ఉండబోతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు ఎంగేజ్‌మెంట్ తర్వాత రష్మిక, విజయ్ ఒకేసారి వేదిక మీద ని ఇష్టపడుతుంది. విక్రమ్ కి జెలసీ, పోసిస్సివెన్స్ ఎక్కువ. తనది పాత కాలం మనస్తత్వం. విక్రమ్ తో రోజులు గడుపుతున్నకొద్ది భూమాకి కొన్ని విషయాలు అర్ధమవుతూ వస్తుంటాయి. రిలేషన్షిప్ లో ఓ చిన్న బ్రేక్ కావాలని ఆడుతుంది. ఆ తర్వాత ఏం జరిగింది? విక్రమ్ ఎలా రియాక్ట్ అయ్యాడు ? ఈ కథలో దుర్గా (అను ఇమ్మానుయేల్) పాత్ర ఏమిటి? చివరికి భూమా ఎలాంటి నిర్ణయం తీసుకుందనేది మిగతా కథ.

## సినిమా ప్రమోషన్‌లో
# రాజమౌళి స్టైలే వేరు



**టాకీస్:** సినిమాను జనాల్లోకి తీసుకెళ్లడం ఓ ఆర్ట్. అది బాగా తెలిసిన వ్యక్తి రాజమౌళి. ఆయన పబ్లిసిటీ స్ట్రాటజీనే వేరు. ఆయన క్రియేటివ్ ఆలోచనలతో ఆ రీచ్ ఎక్కడికో వెళ్లిపోతుంది. అయితే పబ్లిసిటీలో కూడా రెగ్యులర్‌గా కాకుండా ఆయన కొత్త ఒరవడి తీసుకొస్తారాయన. ప్రస్తుతం మహేష్ బాబుతో చేస్తున్న 'ఎస్ఎస్ఎంబీ29' విషయంలో ఆయన థాట్స్ అన్ని భిన్నంగా ఉన్నాయి. మమూలుగా స్టార్ హీరోల సినిమాలంటే ఎంటైర్ మీడియా అక్కడే ఉంటుంది. ఆయా ఈవెంట్‌లను ఛానళ్లు అన్ని ప్రమోట్ చేస్తాయి. కానీ 15న జరగబోయే గ్లోబ్‌ట్రోట్ ఈవెంట్‌ను జక్కన్న ఎక్స్‌క్లూజివ్‌గా జియో, హాట్‌స్టార్‌కి ఇచ్చేశారు. అలాగే ఈ సినిమా అప్డేట్స్ విషయంలో కూడా కొత్త ఎత్తుగడను ఫాలో అవుతున్నారు. ముందు నుంచీ కూడా ఎలాంటి అప్‌డేట్ ఇవ్వకుండానే సినిమాకు విపరీతంగా హైప్ తీసుకొచ్చిన రాజమౌళి.. ఇప్పుడు ఏ అప్‌డేట్ లేకుండానే డైరెక్ట్‌గా కంటెంట్ మీడియాకు వదిలేస్తున్నారు. ఇందులో విలన్‌గా నటిస్తున్న పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్ లుక్ అందుకు ఉదాహరణ. ఆ లుక్ వచ్చేవరకు అది వస్తుందన్న సమాచారం కూడా లేదు.

సోమవారం 'సంచారి' అనే పాటను విడుదల చేశారు. దీనిపై కూడా ముందస్తు సమాచారం ఏమీ లేదు. డైరెక్ట్ రిలీజ్ చేసేశారు. ఆ పాట వస్తుందని సినిమా సర్కిల్స్‌లోనే చాలా మందికి తెలీదు. ముందుగా పాట యాపిల్ మ్యూజిక్‌లో స్ట్రీమ్ అయింది, తర్వాత యూట్యూబ్‌లో దర్శనమిచ్చింది. కాకపోతే రిలీజ్ అయిన తర్వాత రావాల్సిన రీచ్ ఇప్పటికే వచ్చేసింది. మామూలుగా ఇలాంటి పాట వస్తుందంటే ఫస్ట్ సింగిల్ వస్తుందని, లేదా ఇంకేదో అప్‌డేట్ ఇస్తామని పోస్టర్ రూపంలో ముందుగా సమాచారం ఇస్తారు. ఏ సమయానికి వస్తుందో సమయం కూడా చెబుతారు. ఈ మధ్యన భారీ బ్జడెట్ చిత్రాలన్నీ చేసే పని ఇదే. కానీ రాజమౌళి తీరు చూస్తుంటే ఆ పాత పద్ధతికి స్వస్తి చెప్పినట్లు అర్థమవుతుంది. ఈ సినిమాను జనాల్లోకి తీసుకెళ్లడానికి కొత్త పద్ధతి ఫాలో అవుతున్నట్లు తెలుస్తోంది.

# డింపుల్ హాయతికి కలిసి వచ్చేనా ?



**టాకీస్:** సునీల్ కుమార్ రెడ్డి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'గల్ఫ్'మూవీతో నాయికగా తెరంగేట్రమ్ చేసిన డింపుల్ హాయతీ ఈ మధ్య కాలంలో తన నటనకంటే వివాదాస్పద అంశాలతోనే ఎక్కువగా వార్తల్లో నిలిచింది. 2023లో ఓ పోలీస్ ఆఫీసర్ తో తగవు పడిన విషయంలోనూ, కొద్ది నెలల క్రితం ఇంటి పనమ్మాయి ఇచ్చిన ఫిర్యాదుతోనూ డింపుల్ హాయతీ, ఆమె భర్త విక్టర్ డేవిడ్ మీడియాలో కెక్కారు. తెలుగులో రెండేళ్ళ క్రితం గోపీచంద్ 'రామబాణం'సినిమాలో చివరిగా నటించిన డింపుల్ హాయతీకి ఆ తర్వాత మరే సినిమాలోనూ ఛాన్స్ దక్కలేదు. అయితే తాజాగా మాస్ మహరాజా రవితేజ నటిస్తున్న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' లో ఆమె హీరోయిన్‌గా నటిస్తోంది. డింపుల్ హాయతీతో పాటు ఈ సినిమాలో ఆషికా రంగనాథ్ మరో హీరోయిన్. విశేషం ఏమంటే ఆషికా రంగనాథ్... రవితేజ సరసన నటించడం ఇదే మొదటిసారి కానీ డింపుల్ హాయతీ గతంలో రవితేజతో 'ఖిలాడీ' (ఐరత్గి÷జీటతి) మూవీలో నటించింది. ఆ సినిమాలో తన గ్లామర్‌తో, డాన్స్ తో డింపుల్ ఆడియెన్స్ ను మెప్పించినా... సినిమా మాత్రం కమర్షియల్‌గా సక్సెస్ కాలేదు. ఆ తర్వాత వచ్చిన 'రామబాణం' కూడా నిరాశకే గురిచేసింది. దాంతో ఇప్పడు అమ్మడి ఆశలన్నీ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమా మీదనే ఉన్నాయి. సంక్రాంతి కానుకగా రాబోతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ ఒక వేళ హిట్ అయితే... డింపుల్ హాయతీ మళ్ళీ ట్రాక్ లోకి వచ్చే ఆస్కారం ఉంటుంది. మరికొన్ని అవకాశాలు లభించి, కెరీర్ ఇంకొంతకాలంగా సాఫీగా సాగిపోతోంది. లేకపోతే ఇక కష్టమే. ఎందుకంటే... గడిచిన ఏడెనిమిదేళ్ళలో డింపుల్ తెలుగుతో పాటు తమిళ, హిందీ చిత్రాల్లో నటించింది. బట్ ఎందుకో అక్కడ కూడా తనదైన మార్క్ చూపించలేక పోయింది. సో... 'భక్త మహాశయులకు విజ్ఞప్తి' మూవీ డింపుల్ కెరీర్ కు లిట్మస్ టెస్ట్ అనుకోవాల్సి ఉంటుంది.

## ఫిక్షనల్ క్రైమ్
# డ్రామా కాంత

**టాకీస్:** మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ప్రాజెక్ట్ కాంత. సెల్వమణి సెల్వరాజ్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తోంది. రానా కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రాన్ని నవంబర్ 14న విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది దుల్కర్ సల్మాన్ టీం. కాంతను ముందుగా లక్కీభాస్కర్‌తోపాటు షూట్ చేయాలనుకున్నాం. ఫస్ట్ లుక్ టెస్ట్ పూర్తి చేసినప్పుడు ఇద్దరు



డైరెక్టర్లు అక్కడే ఉన్నారు. ఇద్దరు డైరెక్టర్ల టీమ్స్ కూడా రెండు లుక్స్‌లో ఉన్న కామన్ థింగ్‌ను కనుగొనేందుకు ప్రయత్నించాయి. కాంతలో 80స్ పీరియాడిక్ లుక్‌లో మారిపోవాల్సి ఉంటుంది. మీరు ఈ రెండు లుక్స్ కూడా సరిపోల్చుకోవచ్చు. కాంతలో క్లీన్ షేవ్ లుక్‌లో కనిపించాల్సి రావడంతో అది సాధ్యం కాలేదు. కాంత ప్రొడక్షన్స్ పనుల్లో ఆలస్యం కూడా దీనికి ఒక కారణమంటూ చెప్పుకొచ్చాడు దుల్కర్ సల్మాన్. ఇండియన్ యాక్టర్, సినిమాటిక్ సింగర్‌గా పాపులర్ అయిన ఎంకే త్యాగరాజ భగవతార్ ప్రయాణం స్పూర్తిగా సాగే ఫిక్షనల్ క్రైం డ్రామా అని అన్నాడు దుల్కర్ సల్మాన్. అంతేకాదు కాంత సాధారణ పీరియాడిక్ డ్రామా కాదని.. మోడ్రన్ సినిమా చూసిన అనుభూతిని ఇస్తుందని చెప్పారు రానా, దుల్కర్ సల్మాన్. ఇప్పటికే కాంత మూవీ నుంచి చేసిన అమ్మాడివే సాంగ్, రేజ్ ఆఫ్ కాంత ట్రాక్ సినిమాలపై హైప్ క్రియేట్ చేస్తున్నాయి. కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.

## బ్యాడ్ గర్ల్ చూడదగ్గ మూవీ
# అంటున్న శోభిత

**టాకీస్:** ఇండస్ట్రీలో వివాదాస్పదమైన సినిమాలు చాలానే ఉన్నాయి. బ్యాడ్ గర్ల్ చిత్రంపై అక్కినేని కోడలు శోభితా ప్రశంసలు కురిపించింది. ప్రస్తుతం ఈ న్యూస్ నెట్టింట వైరల్ గా మారింది. అక్కినేని కోడలిని అంతగా మెప్పించిన సినిమా ఏది అంటే.. బ్యాడ్ గర్ల్ అంజలి శివరామన్ ప్రధాన పాత్రలో వర్ష భరత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం బ్యాడ్ గర్ల్. వెట్రిమారన్, అనురాగ్ కశ్యప్ నిర్మించిన ఈ సినిమా టీజర్ రిలీజ్ అయినప్పటి నుంచే వివాదాలను ఎదుర్కొంటుంది. ఒక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన అమ్మాయి.. తన యుక్త వయస్సులని లైంగిక కోరికల గురించి చెప్పడం, వాటిని తీర్చుకోవడానికి తహతహలాడడం లాంటివి చూపించడంతో బ్రాహ్మణ సంఘాలు మండిపడ్డాయి. ఈ సినిమాను బ్యాన్ చేయాలనీ డిమాండ్ చేశాయి. ఇక బ్యాడ్ గర్ల్ సినిమా సెప్టెంబర్ లో రిలీజ్ అయ్యి మిక్స్డ్ టాక్ ను అందుకుంది. వివాదం వలన ఎక్కువ పేరు తెచ్చుకోలేకపోయిన ఈ సినిమా ఈ నెల నుంచే జియో హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ అవుతుంది. సినిమా బావున్నా కూడా వివాదం అవుతుందేమో అన్న భయంతో ఎవరు కూడా ఈ చిప్తం÷-రపై స్పందించలేదు. తాజాగా అక్కినేని కోడలు శోభితా మాత్రం బ్యాడ్ గర్ల్ చిత్రం తనకు బాగా నచ్చిందని పోస్ట్ పెట్టింది.

'బ్యాడ్ గర్ల్.. నన్ను నవ్వించింది.. కన్నీళ్లు పెట్టించింది. మంచి సినిమా చూసిన అనుభూతిని అందించింది. అందరూ చూడాల్సిన సినిమా.. ముఖ్యంగా అమ్మాయిలకు ఈ చిత్రాన్ని నేను సిఫార్సు చేస్తున్నాను. ఇది మనకోసం.. వర్ష భరత్ మరియు అంజలి శివరామన్ ను అభినందించాలి' అంటూ చెప్పుకొచ్చింది. దీంతో ఒక్కసారిగా ఈ సినిమాపై ఎక్కడలేని హైప్ వచ్చేసింది. మరి అక్కినేని కోడలి పోస్ట్ వలన ఈ సినిమా రాత మారుతుందేమో చూడాలి.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.